మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385
Published from Jagitial
Circulated to Telangana

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

సోమవారం MONDAY 16-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 256 Issue: 256

16 మార్చి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:27 సూర్యాస్తమయం - సా. 6:22 తిథి ద్వాదశి ఉ. 9:38 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ధనిష్ఠ ఉ. 6:14o వరకు తరువాత శతభిష యోగం శివ ఉ. 9:27 వరకు కరణం తైతుల ఉ. 9:38 వరకు గరజి రా. 9:32 వరకు వర్జ్యం ఉ. 10:00 నుండి ఉ. 11:38 వరకు దుర్ముహూర్తం మ. 12:48 నుండి మ. 1:36 వరకు మ. 3:11 నుండి మ. 3:59 వరకు రాహుకాలం ఉ. 7:56 నుండి ఉ. 9:26 వరకు యమగండం ఉ. 10:55 నుండి మ. 12:24 వరకు గుళికాకాలం మ. 1:54 నుండి మ. 3:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:51 నుండి తె. 5:39 వరకు అమృత ఘడియలు రా. 7:46 నుండి రా. 9:23 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:01 నుండి మ. 12:48 వరకు



## కేటీఆర్ డ్రగ్స్ తీసుకున్నారు!

### టీపీసీసీ చీఫ్ మహేశ్ ఆరోపణలు

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): మొయినాబాద్ డ్రగ్స్ కేసు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతోంది. తాజాగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ టీమ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కావాలంటే ఎమ్మెల్యేందరికీ డ్రగ్ టెస్ట్ చేస్తామన్నారు. " రాష్ట్రంలో ఈగల్ టీమ్ డ్రగ్స్ రహిత సమాజం కోసం దాడులు చేస్తోంది. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డగ్స్ తరువాయి 2 వ పేజీలో...



## నోటీసులతో కొడతా!

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): మొయినాబాద్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో తన పేరును లాగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. అంతేకాదు డ్రగ్స్ టెస్టులు చేయించుకునేందుకు తాను రెడీగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'మాదకద్రవ్యాలు మనుషులుని రాక్షసులుగా మారుస్తాయి. బాధ్యతాయుతమైన స్థానాల్లో తరువాయి 2 వ పేజీలో...




## వాణిజ్య గ్యాస్ సిలిండర్ల పంపిణీ షురూ!

దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సరఫరాపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. 29 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ శనివారం వెల్లడించారు.

న్యూఢిల్లీ: గ్యాస్ సిలిండర్ల నిల్వ, నల్లబజారు విక్రయాలను అరికట్టడానికి దేశవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు, దాడులను ముమ్మరం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దేశంలో గృహావసరాలకు సరిపడా వంట గ్యాస్ నిల్వలు ఉన్నాయని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం -2 వ పేజీలో...

# డ్రగ్స్ 'పుట్ట'!

## పట్టుబడ్డ టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్



### పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీ

### ఆకస్మిక దాడి చేసిన ఈగల్ టీం.. పోలీసులపై కాల్పుల కలకలం

### నిందితులకు 14 రోజుల రిమాండ్.. ఎంపీకి స్టేషన్ బెయిల్ మంజూరు

హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లో శనివారం రాత్రి జరిగిన డ్రగ్స్ ఉదంతం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించింది. ఏపీ టీడీపీకి చెందిన ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, టీజీకి చెందిన మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పట్టుబడటం గమనార్హం. మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో గల ఓ ఫాంహౌస్‌లో శనివారం అర్ధరాత్రి డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న పక్కా సమాచారంతో ఈగల్ టీం రంగంలోకి దిగింది.

మొయినాబాద్-హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): తాండూరు మాజీ ఎమ్మెల్యే (బీఆర్ఎస్) పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫాంహౌస్‌లో విందు పార్టీ జరుగుతుండగా పోలీసుల బృందం మెరుపు దాడి చేసింది. పోలీసులు లోపలికి ప్రవేశించే సమయంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు లోపలికి వస్తున్న క్రమంలో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమిత్ శర్మ తన వద్ద ఉన్న రివాల్వర్‌తో గాలిలోకి కాల్పులు జరిపినట్లు సమాచారం. మొదట ఫాంహౌస్ సెక్యూరిటీ సిబ్బంది పోలీసులను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడంతో, అదనపు బలగాలను రప్పించి తనిఖీలు చేపట్టారు. ఈ పార్టీలో రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో సహా మొత్తం 11 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ముఖ్యులు పుట్టా మహేష్ కుమార్ (ఏలూరు టీడీపీ ఎంపీ), తరువాయి 2 వ పేజీలో...




## 5 రాష్ట్రాల్లో ఓట్ల పండుగ

### మోగిన ఎన్నికల నగారా.. షెడ్యూల్ ప్రకటించిన ఈసీ

### బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు



దేశంలో మళ్లీ ఎన్నికల హడావుడి మొదలుకానుంది. బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి షెడ్యూల్ అనౌన్స్ చేశారు.

న్యూఢిల్లీ: తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీ కాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం. క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,966 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,029 |

## పొగ తీసిన ప్రాణం

### బైక్ పొగ పీల్చి నలుగురు దుర్మరణం

### మృతుల్లో తాత, మనవడు, ఇద్దరు మనవరాళ్లు

### ఏపీలోని అన్నమయ్య జిల్లాలో విషాదం

అన్నమయ్య జిల్లా, మార్చి 15 (ఈవార్తలు): తాత, మనమడు, ఇద్దరు మనమరాళ్లు మృతిచెందడంతో అక్కడ తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. అన్నమయ్య జిల్లా పుంగనూరులోని త్యాగరాజు వీధికి చెందిన మురళి, రేవతి భార్యాభర్తలు. తండ్రి రామచంద్రయ్య, కుమారుడు కార్తీక్, కవల కుమార్తెలు చరిత, చందన ఉన్నారు. మురళి శనివారం తన ద్విచక్రవాహనాన్ని మెకానిక్ వద్ద మరమ్మతు చేయించాడు. ఇంజిన్ సమస్య ఉండటంతో బోర్ చేయించిన అనంతరం బైక్‌ను ఇంటికి తీసుకెళ్లాడు. అయితే రాత్రంతా ద్విచక్ర వాహనం స్టార్టింగ్‌లో ఉంచాలని తరువాయి 2 వ పేజీలో...



ఏపీలోని అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర విషాదం నెలకొంది. మెకానిక్ చెప్పాడని రాత్రంతా బైక్ ఇంజిన్ ఆన్‌లో పెడితే.. దాని నుంచి వచ్చిన పొగ పీల్చి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు.



## 22న రైతు భరోసా విడుదల

### తొలి విడతలో ఎకరం లోపు వారికి జమ.. రూ.3,590 కోట్లు విడుదలకు నిర్ణయం

### 20 రోజుల తర్వాత రెండో విడత.. ఆ తర్వాత మూడో విడత భరోసా రిలీజ్

రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ నెల 22వ తేదీన రైతు భరోసా మొదటి విడత నిధుల విడుదల చేయనుంది. సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో నిధులు విడుదల చేయనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయనుంది. ఈ నిధుల్ని మొత్తం మూడు విడతల్లో విడుదల చేయనున్నారు .

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): తొలి విడతగా రూ.3, 590 కోట్ల నిధులు విడుదల చేయనుండగా, రెండో విడతగా రూ. 2, 650 కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. ఈ నెల 22వ తేదీన తొలి విడత, ఆపై 20 రోజుల తర్వాత రెండో విడత నిధులు విడుదల చేయనుంది తెలంగాణ ప్రభుత్వం. మొత్తం -2 వ పేజీలో...

## విశ్వవాణి



దుబాయ్‌పై ఇరాన్ బాంబుల మోత మోగించడంతో అక్కడి ప్రజలు అన్నీ వదిలిపెట్టి వలసబాట పడుతున్నారు. తమ పెంపుడు జంతువులను కూడా వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో వేలాది మూగ జీవాలు రోడ్లమీదికి వస్తున్నాయని జంతు చారిటీ సంస్థలు పేర్కొంటున్నాయి.

## వేటాడి చంపుతాం

### నెతన్యాహుకు ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్: ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా కూటమి మధ్య జరుగుతున్న యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. తమ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును 'వేటాడి చంపుతామని' ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) శనివారం ప్రతిజ్ఞ చేశాయి. నెతన్యాహు ఆచూకీపై సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వస్తున్న తరుణంలో ఆయన ఎక్కడ ఉన్నా వదిలిపెట్టబోమని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. "అతను బతికే ఉంటే.. అతన్ని వెంబడిస్తాం, పట్టుకుంటాం, చంపేస్తాం" అంటూ టెలిగ్రామ్ ఛానల్ వేదికగా ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన చేసింది. యుద్ధం 16వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై మరోసారి క్షిపణి దాడి జరిగింది. ఎంబసీ ఆవరణలోని హెలిప్యాడ్‌పై మిస్సైల్ పడటంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి.



## నెతన్యాహూ.. జాలీగా!

### కాఫీ తాగుతూ సెటైర్లు

ఇరాన్ సైన్యం దాడుల్లో తాను మరణించినట్టు ప్రచారమవుతున్న వార్తలకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చెక్ పెట్టారు. తాను బతికే ఉన్నానని.. ఇరాన్, పాకిస్థాన్ మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఆదివారం కాఫీ షాపు వెళ్లిన నెతన్యాహు.. కాఫీ తాగుతున్న వీడియో పంచుకున్నారు.

జెరూసలెం: ఆయన తన గురించి శత్రువులు ఏం అనుకుంటున్నారో చెప్పారు. తమ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయేల్ ప్రధానిని తుదముట్టిస్తామని ఇరాన్ ప్రతినబూనింది. ఈ క్రమంలోనే బెంజమిన్ నెతన్యాహూ లక్ష్యంగా ఇరాన్ సైన్యం జరిపిన దాడుల్లో.. ఆయన మరణించారని సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. తాజాగా నెతన్యాహూ మరణించారని ఒక ఏఐ వీడియో కూడా బయటికొచ్చింది. దాంతో, తాను మరణించినట్టు వస్తున్న తప్పుడు 'నేను కాఫీ కోసం చనిపోయాను' అని హిబ్రూ సంజ్ఞలతో తాను చనిపోయినట్టు ప్రచారంలో ఉన్న వదంతులకు ఆయన ముగింపు పలికారు. అంతేకాదు 'నా దేశం చనిపోవడాన్ని నేను ఇష్టపడుతా' అని చెప్పిన తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

16.3.2026

మేషం: దూర ప్రాంత ప్రయాణాలు అనుకూలిస్తాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో ఆశించిన లాభాలు పొందుతారు. వాహన సంభందిత వ్యాపారాలు లాభాలు బాట పడతాయి. వృత్తి, ఉద్యోగముల విషయంలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. ఆర్థిక అభివృద్ధి కలుగుతుంది. ఇతరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

వృషభం: బంధు మిత్రులతో అకారణ వివాదములకు దూరంగా ఉండటం మంచిది. ముఖ్యమైన పనులందు ఆటంకములు కలిగిన సమయస్ఫూర్తితో పనులు పూర్తి చేస్తారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. భాగసామ్య వ్యాపారాలలో నష్ట సూచనలు ఉన్నవి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి.

మిధునం: ముఖ్యమైన పనులలో జీవిత భాగస్వామి సహాయ సహకారాలు అందుతాయి. ఆదాయ వ్యవహారములు మరింత పుంజుకుంటాయి. వ్యాపారాలు విస్తరణకు నూతన అవకాశాలు లభిస్తాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. బంధు మిత్రుల ఆదరణ పొందుతారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కర్కాటకం: నూతన పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. వృత్తి వ్యాపారాలలో పై చేయి సాధిస్తారు. సంతానం పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి.

సింహం: వృత్తి వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. గృహ వాహన సంబంధిత క్రయ విక్రయాలలో అనుకూల ఫలితాలు పొందుతారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి.

కన్య: విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. దీర్ఘకాలిక ఋణాల నుండి కొంత ఊరట లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో నూతన బాధ్యతలు పెరిగిన సమర్ధవంతంగా నిర్వహిస్తారు. సన్నిహితులతో వివాదాలు పరిష్కారమవుతాయి. వ్యాపారాలు ఉత్సాహముగా సాగుతాయి. స్వల్ప ధన లాభ సూచనలున్నవి.

తుల: వృత్తి వ్యాపారాలలో చికాకులు తప్పవు. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఉద్యోగ వ్యవహారములు చిన్నపాటి సమస్యలు ఉంటాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

వృశ్చికం: దూరపు బంధువుల నుండి కొంత కీలక సమాచారం సేకరిస్తారు. విలువైన వస్తువులు విషయంలో జాగ్రత్త వహించాలి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. సన్నిహితులతో వివాదాలు సర్దుమణుగుతాయి. ఉద్యోగమున విధులు సమర్ధవంతంగా నిర్వహించి అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు.

ధనస్సు: దూర ప్రాంత బంధువులు నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. గృహమున బంధు మిత్రులతో ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులలో శ్రమ పెరిగిన నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున పురోగతి కలుగుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయ వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. చెయ్యని పనికి ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం ఉండదు. నూతన వ్యాపార ప్రారంభమునకు ఆటంకాలుంటాయి. ఉద్యోగ విషయంలో అలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

కుంభం: సన్నిహితులతో వివాదాలు పరిష్కరించుకుంటారు. కుటుంబ సభ్యుల నుండి ఊహించని బహుమతులు అందుకుంటారు. గృహమున వివాహ శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారములు అనుకూలంగా సాగుతాయి. సంతానం విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

మీనం: కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. సంతాన విషయమై కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఆదాయం ఆశించిన విధంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు మిశ్రమంగా రాణిస్తాయి. ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. ఆర్థిక లాభాలు అందుతాయి. మిత్రుల నుండి శుభ వార్తలు అందుతాయి.

# డ్రగ్స్ 'పుట్ట'!

మొదటి పేజీ తరువాయి

పైలెట్ రోహిత్ రెడ్డి (మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్), రితేష్ రెడ్డి (రోహిత్ రెడ్డి సోదరుడు), నమిత్ శర్మ (ఢిల్లీ వ్యాపారవేత్త), మరికొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. పట్టుబడిన వారికి పోలీసులు వెంటనే డ్రగ్ అనలైజర్ కిట్‌లతో పరీక్షలు నిర్వహించగా, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మ సహా ఆరుగురికి కొకైన్ తీసుకున్నట్లు పాజిటివ్ అని తేలింది. వీరి రక్త నమూనాలను తదుపరి ధ్రువీకరణ కోసం ల్యాబ్‌కు పంపారు. నిందితుల వద్ద సుమారు 2 గ్రాముల కొకైన్, జర్మనీ తయారీ .32 రివాల్వర్, కొన్ని ఖాళీ తూటాలు, భారీగా విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

## డ్రగ్స్ తీసుకున్నవారిలో టీడీపీ ఎంపీ: ఈగల్ ఎస్పీ గిరిధర్

తెలుగుదేశం పార్టీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు డ్రగ్స్ పాజిటివ్ అని తేలింది. ఈ విషయాన్ని ఈగల్ ఎస్పీ గిరిధర్ అధికారికంగా వెల్లడించారు. శనివారం రాత్రి నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో ఎంపీకి నెగిటివ్ వచ్చినప్పటికీ.. ఆదివారం నిర్వహించిన తదుపరి పరీక్షల్లో పాజిటివ్ అని నిర్ధారణ అయ్యిందని ఎస్పీ తెలిపారు. శరీర మెటబాలిజం కారణంగా ఫలితాల్లో ఈ మార్పు వచ్చినట్లు ఎస్పీ వివరించారు. నిందితులు సిమ్లా నుండి డ్రగ్స్ తీసుకువచ్చి వినియోగించినట్లు గుర్తించామన్నారు. ఈ కేసులో ఎంతటి వారైనా.. ఎంపీ, ఎమ్మెల్యే ఎవరున్నా సరే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గిరిధర్ స్పష్టం చేశారు.

## ఎంపీ పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్

ఈ కేసులో పట్టుబడిన టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌కు పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున ఆయనకు నోటీసులు ఇచ్చి వదిలేసినట్టు తెలిసింది. ఎంపీ మహేశ్ యాదవ్‌తో పాటు మరో నిందితురాలైన ప్రియాంక రెడ్డికి కూడా స్టేషన్ బెయిల్ లభించినట్లు సమాచారం. మరోవైపు, ఈ కేసు దర్యాప్తును ఈగల్ టీమ్ వేగవంతం చేసింది. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు, వారి నుంచి కీలక వివరాలు రాబడుతున్నారు. ఈ పార్టీకి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అయ్యాయి, దీని వెనుక ఎవరున్నారు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

## నిందితులకు 14 రోజుల రిమాండ్

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముగ్గురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు సోదాలకు వెళ్లిన సమయంలో నమిత్ శర్మ అనే వ్యాపారి ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. రోహిత్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసుల వైపునకు కాల్చినట్టు నమిత్‌శర్మ అంగీకరించినట్టు తెలుస్తోంది. పార్టీలో పాల్గొన్న 11 మందిలో 8మందికి నోటీసులిచ్చి వదిలేసిన పోలీసులు.. పైలట్ రోహిత్‌రెడ్డి, అతని సోదరుడు రితేష్‌రెడ్డి, నమిత్ శర్మను ఉప్పర్‌పల్లి కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చారు. గన్ ఫైరింగ్ అంశంపై





ప్రధానంగా వాదనలు జరిగాయి. బెయిల్ ఇవ్వాలని కోరుతూ రోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. నిందితుల బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన న్యాయమూర్తి.. రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించనున్నట్టు పోలీసులు తెలిపారు.



# 5 రాష్ట్రాల్లో ఓట్ల పండుగ

మొదటి పేజీ తరువాయి

ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. "ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం. జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సీఎస్‌లు, డీజీపీలు, నోడల్ అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి బీఎల్‌వోలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. భారత్‌లో ఎన్నికల నిర్వహణ అంటే ప్రజాస్వామ్య పండుగ అంటూ వ్యాఖ్యానించారు. 'ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్‌లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది' అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

## నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో ఇలా!

మొత్తం ఓటర్ల సంఖ్య - 17.4 కోట్లు
మొత్తం అసెంబ్లీ స్థానాలు 824
పోలింగ్ స్టేషన్లు - 2.19లక్షలు
ఎన్నికల అధికారులు - 25 లక్షలు
అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న ఉంటుంది.
కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.
తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.
బెంగాల్: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఉంటుంది. కౌంటింగ్ మే 4.
పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న.

## పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు

ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.



# వాణిజ్య గ్యాస్ సిలిండర్ల పంపిణీ షురూ!

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. స్టాక్ తగినంతగా ఉన్నప్పటికీ, కొందరు అనవసరంగా ముందస్తు బుకింగ్‌లు చేస్తున్నారని, దీనివల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి పడుతోందని సుజాతా శర్మ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఆమె కోరారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ సరఫరాపై కూడా ప్రభుత్వం భరోసా ఇచ్చింది. భారత్ వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయని, దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడా సరఫరాకు ఆటంకం కలగదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.



# పొగ తీసిన ప్రాణం

మొదటి పేజీ తరువాయి

మెకానిక్ చెప్పాడు. మెకానిక్ ఇచ్చిన అనాలోచిత సలహాతో మురళి ఇంట్లో తలుపులు వేసి, ఇంజిన్‌ను ఆన్ చేశాడు. శనివారం రాత్రి తండ్రి, మనుమడు, మనమరాళ్లు ఇంట్లో నిద్రించగా.. మురళి, రేవతి ఇంటిపైన గదిలో పడుకున్నారు. ఇల్లు ఇరుకుగా ఉండటంతో పాటు.. మరోవైపు గాలి బయటకు వెళ్లే వీలు లేకపోవడంతో రాత్రంతా బైక్ నుంచి వెలువడిన పొగ గదిలో వ్యాపించింది. దీంతో తాత, మనుమడు, మనుమరాళ్లు ఆ పొగ పీల్చి మృతి చెందారు. ఈ ఘటనతో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.

# 22న రైతు భరోసా విడుదల

మొదటి పేజీ తరువాయి

మూడు విడతల్లో రూ. 9 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నారు. గత యాసంగిలో రైతు భరోసా పెట్టుబడి సాయం ముందుగానే రైతుల ఖాతాల్లో ఎకరానికి 6 వేల చొప్పున జమ చేసిన విషయం తెలిసిందే. కానీ ప్రస్తుత యాసంగిలో రైతు భరోసా ఇంకా రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తమైంది. చెందుతున్నారు. ఈ యాసంగి రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుందో చేయదో అన్న ఆందోళనలో ఉన్న సమయంలో ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రస్తుత యాసంగి సీజన్ జిల్లా వ్యాప్తంగా 5,16,327 ఎకరాల్లో వరితో పాటు వివిధ పంటలు సాగయ్యాయి. వరి సుమారు 5 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. పెట్టుబడుల సమయంలో రైతుభరోసా అందక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. పొలాలు దున్నకం, విత్తనాలు, ఎరువుల కొనుగోలు, వరి నాట్ల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకుని యాసంగి సాగును పూర్తి చేశారు. రైతు భరోసా వస్తుందనే ఆశతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. తాజాగా రైతు భరోసా నిధులపై ప్రభుత్వ ప్రకటనతో రైతులకు ఊరట లభించింది.

నెతన్యాహూ.. జాలీగా!

నెతన్యాహూ.. తనకు ఆరు చేతులున్న వీడియోపై కాస్త వ్యంగ్యంగా స్పందించారు. తన చేతివేళ్లను కెమెరా వైపు చూపించిన ఆయన.. 'చూడండి నా చేతులకు పది వేళ్లే ఉన్నాయి' అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం సైతం ఒక ప్రకటలో 'నెతన్యాహూ మరణ వార్తలు అన్నీ అవాస్తవం. మా ప్రధాని బతికే ఉన్నారు' అని వెల్లడించింది.

# కేటీఆర్ డ్రగ్స్ తీసుకున్నారు!

మొదటి పేజీ తరువాయి

టెస్టుకు కేటీఆర్ రెడీగా ఉండాలి. కావాలంటే అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరం పరీక్షలు చేయించుకుందాం. సీఎం రేవంత్ .. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేస్తున్నారని" మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. మరోవైపు గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు ఆందోళన చేపట్టారు. నో డ్రగ్స్, సేవ్ తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమలోనే కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిపై వెంకట్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లుగా కేటీఆర్ సన్నిహితులు డ్రగ్స్ వాడారని విమర్శించారు. డ్రగ్స్ అంశంపై మాట్లాడుకుండా దీన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నోటీసులతో కొడతా!

మొదటి పేజీ తరువాయి

ఉన్నవారు కూడా డ్రగ్స్ వాడటం దురదృష్టకరం. డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలకు నేను పూర్తిగా వ్యతిరేకం. రాజకీయంగా ఎంతటి వారైనా మాదక ద్రవ్యాల్ని వినియోగించినా, అక్రమంగా విక్రయించినా, వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలి. అయితే డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్ పార్టీని లాగడాన్ని ఖండిస్తున్నాను. డ్రగ్స్ కేసును బీఆర్ఎస్‌పై రాజకీయ ప్రతీకారంగా వాడుకోవడం మీ రాజకీయాల ప్రతిబింబం. నేను ఇప్పటికే పలుమార్లు చెప్పినట్లుగా ఏ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నాను. అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ఈ పరీక్ష చేయాలని మహేష్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నాను. అలాగే, ప్రతి డ్రగ్స్ కేసులో నా పేరును అనవసరంగా లాగితే చట్టపరమైన నోటీసులు ఇస్తాం'అని హెచ్చరించారు.

## తెలంగాణ క్రీడా రంగానికి అంతర్జాతీయ గుర్తింపు



# ఘనంగా ముగిసిన మహిళల హాకీ పోటీలు

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): హైదరాబాద్ నగరం మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలిచింది. నగరంలోని గచ్చిబౌలి హాకీ స్టేడియం వేదికగా నిర్వహించిన మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు క్రీడా ప్రపంచాన్ని ఆకట్టుకుంటూ విజయవంతంగా ముగిశాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ పోటీలు కేవలం క్రీడలకే పరిమితం కాకుండా, తెలంగాణ ఆతిథ్యం, నిర్వహణ సామర్థ్యం, క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ప్రపంచానికి చాటి చెప్పాయి. మార్చి 8న జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై పోటీలను ఘనంగా ప్రారంభించారు.

వివిధ దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు, అధికారులు, ప్రేక్షకులతో స్టేడియం కిక్కిరిసిపోయి పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ప్రారంభ వేడుకలు తెలంగాణ సంస్కృతి, క్రీడా ఉత్సాహం కలగలిపిన ఒక విశేషమైన క్షణంగా నిలిచాయి. ఈ క్వాలిఫయింగ్ పోటీలు ప్రపంచ హాకీ క్యాలెండర్‌లో ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. ఆగస్టు 14 నుంచి 30 వరకు నేథర్లండ్స్ మరియు బెల్జియం దేశాల్లో జరగబోయే మహిళల హాకీ ప్రపంచ కప్ పోటీలకు అర్హత సాధించేందుకు ఈ మ్యాచ్లు నిర్వహించారు. ఈ పోటీల్లో భారత్‌తో పాటు ఆస్ట్రియా , ఇంగ్లాండ్ , ఇటలీ , కొరియా, స్కాట్లాండ్ , ఉరుగ్వే వేల్స్ వంటి దేశాల జట్లు పాల్గొన్నాయి. ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ప్రపంచంలోని విభిన్న దేశాల ఆటగాళ్లు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించారు. ఈ పోటీల నిర్వహణలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అత్యంత శ్రద్ధతో పని చేసింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఆధునిక ఆస్ట్రోటర్ఫ్‌ను ఏర్పాటు చేశారు. స్టేడియం పరిసరాలను అంతర్జాతీయ మ్యాచ్‌లకు అనువుగా అభివృద్ధి చేసి, ప్రేక్షకులకు ఉత్తమ వీక్షణ అనుభూతి కలిగించేలా అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

విదేశీ జట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, వసతి, రవాణా, వైద్య సేవలు వంటి అన్ని అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి జట్టుకు ప్రత్యేక లైసన్ ఆఫీసర్లను నియమించి వారి అవసరాలను సమన్వయం చేశారు. హాకీ ఇండియా ప్రతినిధులతో కలిసి ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ పోటీల నిర్వహణను విజయవంతం చేశారు. హైదరాబాద్‌కు విచ్చేసిన క్రీడాకారులు, సాంకేతిక నిపుణులు, అధికారులు తెలంగాణ ఆతిథ్యంపై ప్రశంసలు కురిపించారు. నగర ప్రజల ఆత్మీయత, నిర్వహణలో చూపిన నిబద్ధత తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని వారు పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందించింది. ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ముగింపు వేడుకలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ భారత క్రికెటర్ మరియు ప్రజాప్రతినిధి మహమ్మద్ అజహరుద్దీన్ తదితరులు కూడా ఈ కార్యక్రమానికి హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పెద్ద సంఖ్యలో ఈ పోటీలను వీక్షించారు. ప్రత్యేక ముఖ్య కార్యదర్శులు జయేశ్ రంజన్, సవ్యసాచి ఘోష్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సంస్థల సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్ డీజీపీ శివధర్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సింగరేణి సంస్థల పర్సనల్ ఆఫీసర్ భార్గవ్ పాత్రో

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీమతి సృజన తదితరులు హాజరయ్యారు. ఈ పోటీలకు పలువురు ప్రముఖ క్రీడాకారులు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ట్రిపుల్ ఒలింపియన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ముకేశ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని యువ క్రీడాకారులను ప్రోత్సహించారు. తెలంగాణకు చెందిన మహిళా క్రీడాకారిణులు నిధి కుల్లర్, ఎండల సౌందర్య, అర్జున అవార్డు గ్రహీతలు ఇషా సింగ్, దీప్తి జీవన్ జీ, అథ్లెట్ సత్తి గీత వంటి క్రీడా ప్రముఖులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు మాజీ హాకీ క్రీడాకారులు కూడా స్టేడియానికి విచ్చేసి మ్యాచ్‌లను వీక్షించారు. ఈ పోటీల విజయవంతమైన నిర్వహణకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి నేతృత్వంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, హాకీ ఇండియా ప్రతినిధులు, అంతర్జాతీయ హాకీ సమాఖ్య అయిన ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్ మధ్య ఉన్న సమన్వయం కీలకంగా నిలిచింది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీలను నిర్వహించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం క్రీడా రంగంలో తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గచ్చిబౌలిలో జరిగిన మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు తెలంగాణ క్రీడా చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచాయి. ఈ పోటీల ద్వారా రాష్ట్రం క్రీడల అభివృద్ధికి ఎంత ప్రాధాన్యం ఇస్తోందో ప్రపంచానికి తెలిసింది. క్రీడాకారుల ప్రతిభ, ప్రేక్షకుల ఉత్సాహం, ప్రభుత్వ సహకారంకలిసి ఈ పోటీలను ఒక విశేషమైన క్రీడా పండుగగా మార్చాయి. భవిష్యత్తులో కూడా ఇటువంటి అంతర్జాతీయ పోటీలు హైదరాబాద్‌లో మరింతగా నిర్వహించబడాలని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.

## నేను ముస్లింల సోదరుడిని.. ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి








హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): ముస్లిం సమాజ సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ శక్తులు మతాల పేరిట సమాజాన్ని విభజించి, ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'ఇది మీ ప్రభుత్వం, నేను మీ సోదరుడిని. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా నిలబడదాం' అని రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. "మనం సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే అన్ని మతాల వారు ఐక్యంగా ఉండాలి. కొందరు మన మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ముస్లిం సమాజానికి ఇచ్చిన పదవులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మహ్మద్ అజారుద్దీన్‌కు కేబినెట్ మంత్రి పదవి, సీనియర్ నేత మహ్మద్ అలీ షబ్బీర్‌కు ప్రభుత్వ సలహాదారు పదవితో పాటు, ఎనిమిది మంది మైనారిటీ నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చామని తెలిపారు.


### ఎమ్మెల్యేలతో రాజగోపాల్ రెడ్డి

## సీక్రెట్ మీటింగ్?

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్‌లో కలవరపెడుతున్నది. కొంతకాలంగా మంత్రి పదవి కోసం పట్టుబడుతున్న ఆయన.. ఇటీవల కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీక్రెట్ డిన్నర్ మీటింగ్ పెట్టారు. ఒకేసారి 15 మంది ఎమ్మెల్యేలకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆహ్వానం పంపగా.. గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 9 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా హాజరైనట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణలో తనకు మంత్రి పదవి దక్కకుండా అడ్డుకుంటున్నారని.. కొంతకాలంగా సీఎం రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే సీక్రెట్ డిన్నర్ మీటింగ్ పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఈ రహస్య డిన్నర్ మీటింగ్‌పై రాజకీయ వర్గాల్లో భారీ చర్చ మొదలైంది. అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరబోతున్నారనే ప్రచారం నుంచి కోలుకోకముందే.. ఈ 9 మంది ఎమ్మెల్యేల సమావేశం కాంగ్రెస్‌కు మరో షాక్‌గా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మీటింగ్ కొత్త సమీకరణాలకు సంకేతమా? లేక పెద్ద రాజకీయ కుదుపునకు నాందా? అని చర్చించు కుంటున్నారు. రాజగోపాల్ రెడ్డి కూడా బీఆర్ఎస్ వైపే మొగ్గుచూపుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

## శక్తి ఉన్నంతవరకు సిద్దిపేట సేవలోనే: హరీశ్

సిద్దిపేట, మార్చి 15 (ఈవార్తలు): తనలో శక్తి ఉన్నంత వరకు సిద్దిపేట ప్రజల సేవలోనే ఉంటానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేట విద్యాలయాలకు ఖిల్లాగా మారిందని అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచుకుని అన్ని సౌకర్యాలను కల్పించామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ఇలా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసుకున్నామని.. ఇంకా చేసేది కూడా చాలా ఉందని అన్నారు. సిద్దిపేట మిలాన్ గార్డెన్ లో సిద్దిపేట ఫౌండషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాల పంపిణి కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట ఫౌండేషన్ అధినేత సాదాత్ నజీర్ ఫౌండేషన్ ను స్థాపించి నిరుపేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని కొనియాడారు. కుల మతాలకతీతంగా పండుగలు వచ్చినప్పుడు నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తూ అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు షాదీ ముబారక్ పథకాన్ని తీసుకువచ్చి లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించామని



హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగితే 13వేల ఆర్థిక సాయంతో పాటు కేసీఆర్ కిట్ అందేదని తెలిపారు. ఇమామ్, మోజోన్లకు జీతాలు ఇచ్చిన మొట్టమొదటి సీఎం కేసీఆర్ అని అన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. నమాజుతో పాటు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్య బోధనను అందించారని పేర్కొన్నారు. ఇందులో ఒక్కొక్క విద్యార్థికి లక్ష రూపాయల చొప్పున ఖర్చు చేశామని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను ఈ గురుకుల పాఠశాలలో అందించామని తెలిపారు. దీంతో ఇందులో చదువుకున్న విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగానే కాకుండాఉన్నత స్థాయి స్థానాల్లో నిలుస్తున్నారని అన్నారు.

### అసెంబ్లీలో కాంగ్రెస్‌ను ఎండగడతాం

ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేసినట్లే, బీసీలకు ద్రోహం చేశాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన బీసీ డిక్లరేషన్‌కు అతిగతి లేకుండా పోయిందని విమర్శించారు. ఏటా 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు బీసీల కోసం ఖర్చు చేస్తామని మాట తప్పారని అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో క్యాసారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నక్క మల్లేశ్ గౌడ్, కాసా ధనుంజయ్ గౌడ్, నక్క పవన్ గౌడ్, నక్క చరణ్ గౌడ్, నక్క వికాస్ గౌడ్, కాసా వినయ్ గౌడ్, పట్లోళ్ల తిరుపతి రెడ్డి, నక్క వీర స్వామి గౌడ్, నక్క సాయి గౌడ్, బచ్చుగూడెం ఎల్లయ్య యాదవ్, కాసా రాజు గౌడ్, అత్తెల్లి శ్రీకాంత్ రెడ్డి, పెద్దోళ్ల రాజు, ఇతర కార్యకర్తలకు ఉన్నారు.



## బడ్జెట్ సమావేశాలకు గవర్నర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ప్రత్యేకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు పుష్పగుచ్ఛం అందించి.. శాలువాతో సత్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఉప ముఖ్యమంత్రితో పాటుగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసిన వారిలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్-ప్లానింగ్ సెక్రెటరి గౌరవ్ ఉప్పల్, ఆర్థిక శాఖ కార్యదర్శి స్మితా పట్నాయక్ తదితరులున్నారు. కాగా, సోమవారం గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీన రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టనున్నారు. మార్చి 16 వ తేదీ నుంచి 30 వరకూ అసెంబ్లీ సమావేశాలు జరపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. తొలుత ఫిబ్రవరి 26వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరపాలని భావించినా.. ఆ తేదీని కాస్త వెనక్కు జరిపింది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌కు సంబంధించి తుది మెరుగులు దిద్దే క్రమంలోనే అసెంబ్లీ సమావేశాల తేదీని కాస్త వెనక్కు జరపాల్సి వచ్చినట్లు సమాచారం. ఆర్థికశాఖ మల్లు భట్టి విక్రమార్క. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను మార్చి 20వ తేదీన అసెంబ్లీ ప్రవేశపెడతారు. గత బడ్జెట్ కంటే ఈసారి కేటాయింపులు భారీగా ఉండే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్లో పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది.

## ఓర్వలేక డ్రగ్స్ ఆరోపణలు: దాసోజు

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేవనెత్తుతున్న ప్రభుత్వ వైఫల్యాల వల్ల, ఆయనకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. మోకాలుకి, బోడి గుండుకి లింక్ పెట్టినట్లు, మొయినబాద్‌లో ఒక మాజీ ఎమ్మెల్యే ఫార్మ్ హౌస్‌లో పార్టీ జరిగితే, దాన్ని కేటీఆర్‌కు సంబంధం ఉందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చిల్లర రాజకీయాలు, క్యారెక్టర్ అస్సాసినేషన్ చేస్తున్నారని దుయ్యబట్టారు. మూసీ, ఫ్యూచర్ సిటీ అవినీతి గురించి బైట పెట్టినందుకు కేటీఆర్‌పై దాడి చేస్తున్నారని విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నాడని, డ్రగ్స్ గురించి మాట్లాడితే లీగల్ నోటీసులు పంపుతా అని చెప్పిన తర్వాత కూడా మళ్లీ కేటీఆర్‌కు లింక్ పెట్టడం దేనికని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి లాగా ఏది పడితే అది మాట్లాడొద్దని హితవు పలికారు. తప్పు చేస్తే ఎవరినీ వదిలిపెట్టొద్దని, టీడీపీ ఎంపీ అయినా సరే, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అయినా సరే, బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు ఎవరు ఉన్నా తప్పు చేస్తే వదిలిపెట్టొద్దని సూచించారు.

## నేడు, రేపు ఉరుములతో వర్షాలు

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడాని వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నది. ద్రోణి ప్రభావంతో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న తేమ గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తున్నాయని తెలిపింది.

## బిడ్డను గొంతుకోసి చంపిన తల్లి

### యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం

భువనగిరి, మార్చి 15 (ఈవార్తలు): యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కన్నబిడ్డను ఓ తల్లి గొంతు కోసి హతమార్చిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలని భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో బెజ్జంగి రత్నకళ అనే మహిళ తన కూతురు కీర్తన రెడ్డి (14)గొంతు కోసి హత్య చేసింది. కొడుకు బెజ్జంగి అంశాంత్ రెడ్డి నీ కూడా కత్తితో గొంతు కోయడానికి ప్రయత్నించగా తప్పించుకుని కేకలు వేస్తూ పారిపోయాడు.

## నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం

నల్లగొండ, మార్చి 15 (ఈవార్తలు): చింతపల్లి మండలం చెన్నారం గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్నఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మొత్తం ఎనిమిది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని తొలుత దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఏడుగురిని హైదరాబాద్‌కు తరలించారు. మరణించిన వారిలో ఇద్దరు బీహార్‌కు చెందినవారిగా, మరో ఇద్దరు బొత్య తండాకు చెందినవారిగా గుర్తించారు.




# అభివృద్ధి చూసే కాంగ్రెస్‌లో చేరికలు

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, మార్చి 15 (ఈవార్తలు): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం వెంకంపల్లి గ్రామ ఉపసర్పంచ్, టీఆర్పి పార్టీ నాయకుడు పిట్టల కమలాకర్ ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర మండలం మధురానగర్ లోని ప్రజా కార్యాలయంలో కమలాకర్‌కు ఎమ్మెల్యే సత్యం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్ గుండవేణి లావణ్య- తిరుపతి, నాయకులు దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, అంబటి రమేశ్, కడారి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# డీజేఎస్ అధ్యక్షుడిగా బాదిని ఉపేందర్

**సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక**

**హెల్త్ కార్డులు, ఇండ్ల జాగాలపై ప్రభుత్వ పెద్దలను కలవాలని తీర్మానం**

సోమాజిగూడ-హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): డెస్క్ జర్నలిస్టుల గొంతుకగా, వారి సంక్షేమం, ప్రయోజనాల కోసం డెస్క్ జర్నలిస్టుల సంఘం(డీజేఎస్) ఏర్పడిందని డీజేఎస్ ప్రెసిడెంట్ బాదిని ఉపేందర్ స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి.. డెస్క్ జర్నలిస్టుల ప్రస్తావన తేవడం మనందరి ఐక్య పోరాటానికి దక్కిన గుర్తింపని పేర్కొన్నారు. ఇకముందు కూడా ఇదే యూనిటీతో మన సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉపేందర్ మాట్లాడారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ మీడియాల్లో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల పెంపు, జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టులకు చోటు, మొత్తం అక్రెడిటేషన్లలో మహిళలకు 33శాతం కోటాపై డీజేఎస్ చేసిన వినతులు, విజ్ఞప్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలిసిందన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి అనుకూల నిర్ణయం రాకపోతే భవిష్యత్ పోరాటాలు మరింత ఉధృతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం, డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డెస్క్ జర్నలిస్ట్స్ సంఘం ప్రెసిడెంట్‌గా బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా రాజారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సోమనర్సయ్య(వరంగల్), ట్రెజరర్‌గా వెంకటరమణ, జాయింట్ సెక్రటరీలుగా కనపర్తి రమేశ్, కాంకూరి వెంకటేశ్వర్(ఖమ్మం), భీంరావు(నిజామాబాద్), కమిటీ మెంబర్లుగా గరిమ, పద్మ, సత్యప్రసాద్ ఎన్నికయ్యారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇండ్ల జాగల విషయంలో ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అధికారులకు వినతులు సమర్పించాలని డీజేఎస్ తీర్మానించింది. సమావేశంలో నరేందర్, సదానందం, లింబాద్రి, అశోక్, రమేశ్ కుమార్, సత్యం, జిల్లా డెస్క్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం సమీపంలో పెద్దపులి కలకలం

కాకినాడ, మార్చి 15 (ఈవార్తలు): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో గత 16 రోజులుగా సంచరిస్తున్న పులి, ఇప్పుడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం సమీపానికి చేరడంతో తీవ్ర కలకలం రేగింది. దీంతో అటవీ, పోలీసు, దేవస్థానం అధికారులు అప్రమత్తమై భక్తులకు, స్థానిక గ్రామస్థులకు హెచ్చరికలు జారీ చేశారు. శంఖవరం, ఊరకొండ ప్రాంతాల నుంచి కత్తిపూడి మార్గం దాటిన పులి, మండపం గ్రామం పొలాల మీదుగా అన్నవరం పంపా రిజర్వాయర్ మార్గంలోకి ప్రవేశించిందని అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నవరం, తాళ్లపాలెం, మండపం, బెండపూడి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. పొలాల్లో పనిచేసే రైతులు వెంటనే ఇళ్లకు తిరిగి రావాలని సూచించారు. అన్నవరం వచ్చే భక్తులు కూడా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో ఒంటరిగా ప్రయాణించవద్దని, వాహనాలను ఎక్కడా నిలపవద్దని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో వసతి గదుల నుంచి బయటకు రావద్దని స్పష్టం చేశారు. పులిని సురక్షితంగా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు భారీ ఆపరేషన్ చేపట్టారు. కాకినాడ జిల్లా డీఎఫ్‌వో ఎన్. రామచంద్రరావు నేతృత్వంలో సుమారు 100 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ట్రాకింగ్ బృందాలు, డార్టింగ్ సిబ్బంది పులి కదలికలను నిరంతరం గమనిస్తున్నారని, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ రెడ్డి ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం పులి సంచారం నేపథ్యంలో ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.





# బొంతు శ్రీదేవిని కలిసిన ఓదెల నరేశ్

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన సామాజిక కార్యకర్త ఓదెల నరేశ్ ఆదివారం హైదరాబాద్‌లో బొంతు రామ్మోహన్ సతీమణి శ్రీదేవిని కలిశారు. కుషాయిగూడలోని మెట్రో ఉదయం ఆఫీస్‌లో ఆమెకు మర్యాదపూర్వకంగా కలిసిన నరేశ్.. వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నరేశ్‌కు అండగా ఉంటామని శ్రీదేవి హామీ ఇచ్చినట్లు నరేశ్ పేర్కొన్నారు.

# డ్రగ్స్‌తో ఎంపీ ఇచ్చే సందేశమేంటి?

**టీడీపీపై వైఎస్ షర్మిల ఫైర్**



విజయవాడ, మార్చి 15 (ఈవార్తలు): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో టీడీపీ ఎంపీ పట్టుబడటం సిగ్గుచేటని విమర్శించారు. అతడిపై తక్షణమే అనర్హత వేటు వేయాలని, తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, ఇక్కడ ఎంపీ కొకైన్‌తో విందు, చిందులు చేయడం దారుణం. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తారా? డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చింది కదా, ఇప్పుడు చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారు?" అని ప్రశ్నించారు. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన ఎంపీ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని, యువతను డ్రగ్స్ వాడమని ప్రోత్సహిస్తున్నారా? అని షర్మిల నిలదీశారు. ఓట్లు వేసి గెలిపించిన ఏలూరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. డ్రగ్స్‌పై నిజంగానే కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలనుకుంటే, ముందుగా తమ సొంత పార్టీ ఎంపీపై చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని షర్మిల సవాల్ విసిరారు.

## డ్రగ్స్ తీసుకోలే.. డిన్నర్‌కు వెళ్లా

**ఎంపీ పుట్టా మహేశ్ బుకాయింపు**

హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీలో తాను డ్రగ్స్ తీసుకున్నట్టు వచ్చిన కథనాలను ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ తీవ్రంగా ఖండించారు. స్టేషన్ బెయిల్‌పై విడుదలైన కొద్ది గంటలకే ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, కేవలం స్నేహితులతో కలిసి డిన్నర్ కోసమే అక్కడికి వెళ్లానని స్పష్టం చేశారు. తనకు ఎలాంటి చెడు అలవాట్లు లేవని, తనపై నియోజకవర్గ ప్రజలు, పార్టీ ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని పుట్టా మహేష్ అన్నారు. మీడియాలో వస్తున్న కథనాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కేసు విచారణకు పూర్తిగా సహకరిస్తానని, త్వరలోనే అన్ని వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు.



# పుట్టాపై చంద్రబాబు సీరియస్

**పార్టీకి దూరంగా ఉండాలని హుకుం**

**నోటీసులు ఇవ్వాలని పల్లాకు ఆదేశం**

అమరావతి, మార్చి 15 (ఈవార్తలు): మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పట్టుబడటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్న ఆయన, పార్టీ కార్యకలాపాలకు తక్షణమే దూరంగా ఉండాలని పుట్టా మహేశ్‌ను ఆదేశించారు. ఈ విషయంపై స్పందించిన చంద్రబాబు.. పుట్టా మహేశ్ నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, డ్రగ్స్ కేసులో పుట్టా పట్టుబడిన వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని కూడా పల్లాను ఆదేశించారు. వ్యక్తుల బలహీనతలు, వ్యక్తిగత తప్పిదాల వల్ల పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. డ్రగ్స్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా సరే, ఉపేక్షించే ప్రసక్తే లేదని పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఆయన ఉద్ఘాటించారు. ఈ ఘటనపై పార్టీపరంగా కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలను ఇచ్చారు.

# 5 రోజుల్లో వివరణ ఇవ్వాలి

## పుట్టాకు టీడీపీ షోకాజ్ నోటీసు

విజయవాడ, మార్చి 15 (ఈవార్తలు): తెలుగుదేశం పార్టీకి చెందిన ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేశ్ పై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీలో ఆయన మత్తుపదార్థాలు తీసుకున్నారన్న అంశం నేపథ్యంలో, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఐదు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని స్పష్టం చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పుట్టా మహేశ్‌కు అధికారికంగా నోటీసు పంపారు. మార్చి 14వ తేదీన మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన ఘటన, ఆ తర్వాత మీడియాలో వచ్చిన కథనాలను పార్టీ అధిష్ఠానం చాలా సీరియస్‌గా తీసుకుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ పరిణామాలు పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. "ఈ అంశంపై సమగ్ర నివేదిక వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పార్టీ మిమ్మల్ని ఆదేశిస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించి మీ లిఖితపూర్వక వివరణను 5 రోజుల్లో పార్టీకి అందజేయాలి" అని నోటీసులో పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.




## బాబు, రేవంత్‌కు హాట్‌లైన్ సంబంధాలు: మార్గాని

తూర్పుగోదావరి జిల్లా, మార్చి 15 (ఈవార్తలు): రేవ్ పార్టీలో అడ్డంగా దొరికిన ఎంపీ మహేష్ యాదవ్‌పై టీడీపీ ఓ నిర్ణయం తీసుకుంటుందో.. లేదో స్పష్టం చేయాలని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. ఇంతవరకు టీడీపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇవాళ మార్గాని భరత్ మాట్లాడుతూ.. 'ఏపీ సీఎం చంద్రబాబుకు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి హాట్‌లైన్ సంబంధాలు ఉన్నాయి. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టును చంద్రబాబుతో చెప్పి నిలుపు చేయించానని రేవంత్ రెడ్డి ఏకంగా అసెంబ్లీలో ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతిన్నప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదు. పైకి నో టు డ్రగ్స్ అంటూ క్యాంపెయిన్ చేస్తున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ అందుబాటులో ఉంటున్నాయి. రేవ్ పార్టీలో అడ్డంగా దొరికిన మహేష్ యాదవ్‌తో పదవికి రాజీనామా చేయించాలి, ఆయనను చంద్రబాబు పార్టీ నుంచి ఎక్స్పెల్ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ అదుపు చేయటానికి అనేక చర్యలు తీసుకున్నారు' అని తెలిపారు.

# సీబీఐ దర్యాప్తుపై సునీత తీవ్ర అసంతృప్తి

పులివెందుల, మార్చి 15 (ఈవార్తలు): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ తీరుపై ఆయన కుమార్తె డాక్టర్ సునీత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీబీఐ బాధ్యతాయుతంగా, లోతుగా దర్యాప్తు చేయలేదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. కడప జిల్లా పులివెందులలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కేసులో తనకు అందరూ అన్యాయం చేస్తున్నారని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. "నిందితులు చెప్పింది వినడమే తప్ప సీబీఐ లోతుగా దర్యాప్తు జరపలేదు. హత్యకు ముందు, తర్వాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. సాక్షిలో గుండెపోటు వార్త రావడానికి నిమిషం ముందే కిరణ్ యాదవ్ అనే వ్యక్తి అర్జున్‌రెడ్డికి మెసేజ్ పంపాడు. ఈ కీలక ఆధారాన్ని సీబీఐ ఎందుకు లోతుగా పరిశీలించలేదు?" అని ఆమె ప్రశ్నించారు. తాను కోర్టుతో పాటు సీబీఐకి కూడా అదనపు ఆధారాలు సమర్పించినప్పటికీ, వాటిపై కూడా సరైన విచారణ జరగలేదని సునీత ఆరోపించారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన అర్ధాంగి భారతిని విచారించాల్సిన అవసరం ఉందని, కానీ సీబీఐ వారిని విచారించలేదని అన్నారు. తాను



ఇంతగా పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన సునీత.. న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# పుట్టాకు ఎంపీగా ఉండే అర్హత లేదు: కాకాణి

తాడేపల్లి, మార్చి 15 (ఈవార్తలు): డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. పుట్టా మహేశ్‌ను రక్షించడానికి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగారని, డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన వీకెండ్ పార్టీలో డ్రగ్స్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు ఈగిల్ ఫోర్స్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటన ఏపీ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ నేపథ్యంలో కాకాణి మాట్లాడుతూ, "చంద్రబాబు బ్రాండ్ అంటేనే డ్రగ్స్ బ్రాండ్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనతో వైసీపీ నేతలు టీడీపీని 'డ్రగ్స్ పార్టీ'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ డ్రగ్స్ కేసుపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇదే ఫామ్‌హౌస్‌లో కాల్పులు జరిపిన వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం పుట్టా మహేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



# ఏపీలో టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

విజయవాడ, మార్చి 15 (ఈవార్తలు): ఏపీలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1వ తేదీ వరకూ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం గం. 9.30 ని.లు నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షా సమయం ఉంటుంది. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 3,415 పరీక్ష కేంద్రాల ఏర్పాటు చేశారు. 6,40,916 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు. 6,22,074 మంది రెగ్యులర్ విధానంలో పరీక్షలు రాస్తుండగా,, 18,842 మంది ప్రైవేటు విధానంలో పరీక్షలు రాయనున్నారు. మొత్తం పరీక్షలు రాసేవారిలో 3,28,652 మంది బాలురు, 3,12,264 మంది బాలికలు ఉన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలో రిపోర్టు చేయాలని, 10 గంటల తర్వాత ఎవ్వరిని లోనికి అనుమతించబోమని పరీక్షల విభాగం పేర్కొంది. పరీక్షల నిర్వహణ కి 38,958 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మాల్ ప్రాక్టీసు అరికట్టేందుకు 156 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

# ఇరాక్‌లో డ్రోన్ల బీభత్సం



## రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం.. అమెరికా ఎంబసీపై దాడులు

ఎర్బిల్: ఉత్తర ఇరాక్‌లోని ఎర్బిల్ నగరంలో శనివారం రాత్రి డ్రోన్ దాడి కలకలం సృష్టించింది. లానాజ్ ఆయిల్ రిఫైనరీ లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఆకాశమంత ఎత్తున దట్టమైన నల్లటి పొగ అలుముకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటన నేపథ్యంలో రిఫైనరీలో చమురు ఉత్పత్తిని అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. కుర్దిస్థాన్ ప్రాంత ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నాటికి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, పనులు ఇంకా మొదలుకాలేదు. దాడి వల్ల జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పటివరకు రిఫైనరీ కార్యకలాపాలు పునరుద్ధరించే అవకాశం లేదని సమాచారం. మరోవైపు, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై కూడా శనివారం దాడులు జరిగాయి. ఎంబసీ ప్రాంగణంలోని 'హెలిప్యాడ్', 'రాడార్ వ్యవస్థ' లక్ష్యంగా సూసైడ్ డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో కార్యాలయ ప్రాంగణంలో మంటలు చెలరేగి ఆస్తి నష్టం వాటిల్లింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు మొదలుపెట్టిన తర్వాత బాగ్దాద్‌లోని ఎంబసీపై దాడి జరగడం ఇది రెండోసారి. బాగ్దాద్ విమానాశ్రయం వద్ద ఉన్న అమెరికా దౌత్య కార్యాలయం, మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని నిరంతరం డ్రోన్ దాడులు జరుగుతున్నాయి. ఇరాన్ మద్దతు గల 'ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్' గ్రూపు ఈ దాడులకు బాధ్యత వహిస్తూ ప్రకటనలు విడుదల చేస్తోంది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన రాయబార కార్యాలయ సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించింది.

# ప్రవాసులకు భారత్ రక్షణ

### సొంత పౌరుల భద్రతలో మేటి..అంతర్జాతీయ మీడియా ప్రశంసలు

దుబాయ్: ప్రపంచంలోని ఏ మూలన సంక్షోభం తలెత్తినా, యుద్ధ మేఘాలు కమ్ముకున్నా... అక్కడ చిక్కుకుపోయిన తమ పౌరులను కాపాడుకోవడంలో భారత్ అత్యంత చురుగ్గా, వేగంగా స్పందించే దేశంగా ముందు వరుసలో నిలుస్తోందని ఓ తాజా నివేదిక ప్రశంసించింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత, సమన్వయంతో కూడిన భారీ తరలింపు చర్యలు ప్రపంచవ్యాప్తంగా దేశ కీర్తిని పెంచుతున్నాయని 'టైమ్స్ కువైట్' తన కథనంలో పేర్కొంది. కేవలం తమ పౌరులనే కాకుండా, అత్యవసర సమయాల్లో విదేశీయులను సైతం సురక్షితంగా తరలించి భారత్ తన మానవతా దృక్పథాన్ని, అంతర్జాతీయ సంఘీభావాన్ని చాటుకుంటోందని ఆ నివేదిక కొనియాడింది. వేగవంతమైన దౌత్యపరమైన చర్చలు, ప్రభుత్వ ఏజెన్సీల మధ్య అద్భుతమైన సమన్వయం, సమర్థవంతమైన సైనిక లాజిస్టిక్స్‌తో వేలాది మంది భారతీయులను ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షితంగా స్వదేశానికి చేర్చగలిగిందని వెల్లడించింది. ఇటీవలి కాలంలో చేపట్టిన ఆపరేషన్ రాహత్, ఆపరేషన్ సంకట్ మోచన్, ఆపరేషన్ గంగ, ఆపరేషన్ కావేరి వంటివి ఇందుకు నిదర్శనమని నివేదిక వివరించింది. 2025 మధ్యలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు' పేరుతో తమ పౌరులను సురక్షితంగా తరలించింది. సంక్షోభ ప్రాంతంలోని వారిని ముందుగా పొరుగున ఉన్న అర్మేనియాకు తరలించి, అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు. ఈ తరలింపు ప్రక్రియ చాలా సాఫీగా, చక్కటి ప్రణాళికతో జరిగిందని, ప్రయాణ ఏర్పాట్లు చేసేంత వరకు సౌకర్యవంతమైన వసతి కల్పించారని స్వదేశానికి తిరిగి వచ్చిన వారు తెలిపినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారత రాయబార కార్యాలయం అందించిన సహాయం చూసి తాను ఆశ్చర్యపోయానని కశ్మీర్‌కు చెందిన సెహ్రిష్ రఫీక్ చెప్పినట్లు టైమ్స్ కువైట్ ఉటంకించింది. 'మా కోసం రాయబార కార్యాలయం ఇంతలా శ్రమిస్తుందని నేను మొదట నమ్మలేకపోయాను. కశ్మీరీలు అందరూ భారత ప్రభుత్వానికి నిజంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు' అని ఆమె అన్నారు. ఈ ఆపరేషన్ ఎంతో సహాయకారిగా ఉందని, తమ భద్రతకు భరోసా ఇచ్చిన ఎంబసీకి పుల్వామాకు చెందిన మీర్ మహ్మద్ ముషారఫ్ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో భారత్ 'ఆపరేషన్ గంగ'ను ప్రారంభించి రికార్డు స్థాయిలో తరలింపు చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా 23,000 మందికి పైగా భారత పౌరులతో పాటు 18 దేశాలకు చెందిన 147 మంది విదేశీయులను కూడా సురక్షితంగా తరలించింది. పౌరులను మొదట పోలాండ్, రొమేనియా, హంగరీ, స్లోవేకియా, మోల్డోవా వంటి పొరుగు దేశాలకు చేర్చి, అక్కడి నుంచి ప్రత్యేక పౌర, సైనిక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు. కాగా, 'విదేశాల్లోని భారత పౌరుల భద్రత, శ్రేయస్సే మా ప్రథమ ప్రాధాన్యత. వారిపై ప్రతికూల ప్రభావం చూపే పరిణామాలను మేము ఉపేక్షించలేము' అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.



## ట్రంప్‌ను గేలి చేసిన ఇరాన్

టెహ్రాన్: పశ్చిమాసియాలో ముదిరిన ఉద్రిక్తత ఇరాన్, అమెరికాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. హర్మూజ్ జలసంధిని సురక్షితంగా ఉంచేందుకు జపాన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన విజ్ఞప్తిని ఇరాన్ ఎగతాళి చేసింది. అమెరికా చివరకు తన బద్ధశత్రువు చైనాను కూడా సాయం కోరడంపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 'ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం అని చెప్పుకునే అమెరికా.. ఇప్పుడు తన నౌకల రక్షణ కోసం ఇతర దేశాల ముందు యాచిస్తోంది. చివరకు చైనాను కూడా బతిమాలుకునే స్థాయికి ట్రంప్ దిగజారారు' అని ఇరాన్ అధికారులు ఎద్దేవా చేశారు.

## దుబాయ్ ఎయిర్‌పోర్ట్ క్లోజ్

దుబాయ్: అమెరికా-ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఈరోజు ఉదయం ఇరాన్ జరిపిన క్షిపణి దాడులతో దుబాయ్, కువైట్ నగరాలు దద్దరిల్లాయి. దుబాయ్‌లోని ప్రధాన ఆర్థిక కేంద్రాలు, మెరీనా, అల్ సుఫూహ్ వంటి నివాస ప్రాంతాలలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. దుబాయ్ ఎయిర్‌పోర్టు సమీపంలో క్షిపణి శకలాలు పడటంతో విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. విమానాశ్రయంలోని ఇంధన ట్యాంకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడిలో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. క్షిపణి శకలాలు పడటంతో విమానాశ్రయ రన్ వే దెబ్బతిన్నట్లు సమాచారం. కువైట్‌లోని అహ్మద్ అల్-జాబర్ ఎయిర్ బేస్‌పై కూడా డ్రోన్ల దాడి జరిగినట్లు కువైట్ రక్షణ శాఖ ధృవీకరించింది. ఈ దాడుల్లో పలువురు కువైట్ సైనికులు గాయపడ్డారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ఈ దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తన గగనతలంలోకి దూసుకొచ్చిన 9 బాలిస్టిక్ క్షిపణులను, 33 డ్రోన్లను విజయవంతంగా అడ్డుకున్నట్లు ప్రకటించింది.

## పశ్చిమాసియాకు ఆగని విమానాలు

### 72 సర్వీసులు నడుపుతున్న ఎయిర్ ఇండియా

పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సేవలను కొనసాగిస్తున్నాయి. ఆదివారం ఒక్కరోజే పశ్చిమాసియా దేశాలకు, అక్కడి నుంచి భారత్‌కు కలిపి మొత్తం 72 షెడ్యూల్డ్, నాన్-షెడ్యూల్డ్ విమానాలను నడపనున్నట్లు ఈ సంస్థలు ప్రకటించాయి. జెడ్డా, మస్కట్ నగరాలకు షెడ్యూల్డ్ సర్వీసులు యథావిధిగా నడుస్తాయని ఎయిర్ ఇండియా తెలిపింది. భారత్, జెడ్డాల మధ్య మొత్తం 8 విమానాలు రాకపోకలు సాగిస్తాయి. ఇందులో భాగంగా ఢిల్లీ, ముంబైల నుంచి ఎయిర్ ఇండియా ఒక్కో సర్వీసును, బెంగళూరు, కోజికోడ్‌ల నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఒక్కో సర్వీసును నడుపుతాయి. అదేవిధంగా మస్కట్‌కు ఢిల్లీ, కొచ్చి, కోజికోడ్, మంగళూరు, ముంబై, తిరువనంతపురం నుంచి 12 షెడ్యూల్డ్ విమానాలు నడుస్తాయి. ఇవి కాకుండా, యూఏఈ, సౌదీ అరేబియాలకు 52 నాన్-షెడ్యూల్డ్ విమానాలను కూడా నడపనున్నట్లు సంస్థ వెల్లడించింది.

# షెడ్యూల్ ముందు హామీలపై ఏం చేయలేం

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి




న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా, ఎన్నికల తేదీల ప్రకటనకు కొద్ది గంటల ముందు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన జనరంజక పథకాల ప్రకటనలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు తీసుకున్న విధానపరమైన నిర్ణయాలపై తాము జోక్యం చేసుకోలేమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు మీడియా సమావేశంలో మాట్లాడిన సీఈసీ, "ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి రాకముందు రాష్ట్రాలు ఎలాంటి విధానపరమైన నిర్ణయాలైనా తీసుకోవచ్చు. ఇప్పుడు కోడ్ అమల్లోకి వచ్చింది" అని తెలిపారు. ఎన్నికలు హింస, ప్రలోభాలకు తావు లేకుండా నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పురోహితులు, మౌజన్‌లకు ఇచ్చే నెలవారీ గౌరవ వేతనాన్ని రూ. 500 పెంచుతున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల తర్వాత సీఈసీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అలాగే, తమిళనాడులో బీజేపీ అధికారంలోకి వస్తే మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ. 10,000 జమ చేస్తామని ఆ పార్టీ నేత కె. అన్నామలై హామీ ఇచ్చారు. గత నెలలోనే అధికార డీఎంకే ప్రభుత్వం 'కళైనార్ మగళీర్ ఉరిమై తిట్టం' పథకం కింద 1.31 కోట్ల మంది మహిళలకు రూ. 5,000 చొప్పున జమ చేసింది. షెడ్యూల్ ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లో (294 సీట్లు) ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. తమిళనాడులో (234 సీట్లు) ఏప్రిల్ 23న ఒకే దశలో పోలింగ్ నిర్వహిస్తారు. అసోం, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరుగుతాయి. ఈ అన్ని రాష్ట్రాల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. వీటితో పాటు గోవా, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, త్రిపుర రాష్ట్రాల్లోని 8 నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు కూడా నిర్వహిస్తున్నట్లు, వాటి ఫలితాలు కూడా మే 4నే వెల్లడిస్తామని సీఈసీ తెలిపారు.


# కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

### ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ



న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు, బహుజన నేత కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధానికి ఓ లేఖ రాశారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. వారి ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారని వివరించారు. ఆయన కృషి వల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఇటీవల లక్నోలో జరిగిన 'సామాజిక్ పరివర్తన్ దివస్' కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవమని, ఆయనను సాధికారతకు చిహ్నంగా భావించే కోట్లాది మంది ఆకాంక్షలను నెరవేర్చినట్టు అవుతుందని రాహుల్ తన లేఖను ముగించారు. అయితే, రాహుల్ డిమాండ్‌పై బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శలు గుప్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి దళిత ఐకాన్‌ల గుర్తింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ గత రికార్డును ఆమె ప్రశ్నించారు.

## సరదాకి కూడా దాడులు చేస్తాం : ట్రంప్



ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు చెందిన కీలకమైన ఖర్గ్ ద్వీపంపై "సరదాకి కూడా మరికొన్ని దాడులు చేయొచ్చు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే అమెరికా జరిపిన దాడుల్లో ఖర్గ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలు చాలావరకు "పూర్తిగా ధ్వంసమయ్యాయి" అని ఆయన స్పష్టం చేశారు. శని, ఆదివారాల్లో ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కార్యక్రమాలు, క్షిపణి ముప్పులకు ప్రతిస్పందనగా ఇటీవల అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. ఇందులో భాగంగా మార్చి 13న ఖర్గ్ ద్వీపంపై అమెరికా వైమానిక దాడులు జరిపింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఖర్గ్ ద్వీపం నుంచే జరుగుతాయి.

## త్వరలో రైల్వేలో పీఆర్ఎస్

### కొత్త రిజర్వేషన్ సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి

న్యూఢిల్లీ: సుమారు 40 ఏళ్లుగా వినియోగంలో ఉన్న పాత టికెట్ రిజర్వేషన్ సాఫ్ట్‌వేర్‌కు రైల్వే శాఖ వీడ్కోలు పలకనుంది. దాని స్థానంలో అత్యంత వేగవంతమైన, ఆధునిక టెక్నాలజీతో కూడిన కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్)ను అందుబాటులోకి తేనుంది. ఈ కొత్త వ్యవస్థ ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఉన్న సిస్టమ్ తరచూ నెమ్మదిగా పనిచేయడం, తత్కాల్ బుకింగ్ సమయంలో క్రాష్ అవ్వడం వంటి సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో "పీఆర్ఎస్ ఆధునికీకరణ ఫేజ్ 2" పేరుతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. రైల్వే మంత్రిత్వ శాఖ కింద పనిచేసే సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఈ కొత్త వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం ఈ సిస్టమ్ టెస్టింగ్ దశలో ఉందని, ఏప్రిల్-జూన్ మధ్యలో లైవ్‌లోకి వస్తుందని క్రిస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొత్త సిస్టమ్ ద్వారా టికెట్ బుకింగ్ సామర్థ్యం భారీగా పెరగనుంది. ప్రస్తుతం నిమిషానికి 25,000 టికెట్లు మాత్రమే బుక్ చేయగలుగుతుండగా, కొత్త వ్యవస్థతో నిమిషానికి లక్షకు పైగా టికెట్లు బుక్ చేయవచ్చు. అలాగే, టికెట్ ఎంక్వైరీల సామర్థ్యం కూడా నిమిషానికి 4 లక్షల నుంచి 40 లక్షలకు పెరగనుంది. ఈ ఆధునికీకరణ కోసం సుమారు రూ. 1,000 కోట్లు ఖర్చు చేస్తున్నారు

## నెతన్యాహు తనయుడు 'మిస్సింగ్'

### వారం నుంచి కనిపించని యాయిర్ నెతన్యాహు!

జెరూసలెం: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెన్యామిన్ నెతన్యాహు కుటుంబంపై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా నెతన్యాహు పెద్ద కుమారుడు యాయిర్ నెతన్యాహు గత వారం రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కడా కనిపించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, విపక్షాలపై విరుచుకుపడే యాయిర్.. ఈ క్లిష్ట సమయంలో మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. యాయిర్ నెతన్యాహు ఎక్స్ వేదికగా రోజుకు సగటున 30 నుంచి 40 పోస్టులు చేస్తుంటారు. అయితే, మార్చి 8వ తేదీ తర్వాత ఆయన నుంచి ఒక్క పోస్ట్ కూడా రాలేదు. మార్చి 9న ఒక చిన్న రీపోస్ట్ తప్ప, ఆయన సొంతంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఒకవైపు నెతన్యాహు ఆరోగ్యంపై, ప్రాణహానిపై ఇరాన్ అనుకూల మీడియా వార్తలు ప్రసారం చేస్తున్న వేళ, యాయిర్ ఇలా 'మాయం' అవ్వడం "కుటుంబంలో ఏదైనా విషాదం జరిగిందా?" అనే వదంతులకు దారితీసింది. ప్రస్తుతం యాయిర్ నెతన్యాహు అమెరికాలోని మయామిలో నివసిస్తున్నట్లు సమాచారం. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో అమెరికాలోని ఇజ్రాయెల్ ప్రముఖుల కుటుంబ సభ్యులకు భద్రతా ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా మాజీ నిఘా అధికారి ఒకరు మాట్లాడుతూ.. ఇలాంటి ఉద్రిక్త సమయాల్లో యాయిర్ వంటి వ్యక్తులు బహిరంగంగా తిరగడం లేదా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం ప్రమాదకరమని, అందుకే ఆయనకు 'లో ప్రొఫైల్' మెయింటైన్ చేయాలని సూచించి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. యాయిర్ మౌనం కేవలం భద్రతా జాగ్రత్తల్లో భాగంగా తీసుకున్న నిర్ణయమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

## వారంలో ఎస్బీఐకి 89 వేల కోట్ల లాస్

ముంబై: గతవారం స్టాక్ మార్కెట్లలో చోటుచేసుకున్న భారీ పతనం దేశంలోని అగ్రశ్రేణి కంపెనీలను తీవ్రంగా దెబ్బతీసింది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అత్యధికంగా నష్టపోయింది. ఒక్కవారంలోనే ఎస్ బీఐ మార్కెట్ క్యాపిటలైజేషన్ (ఎం-క్యాప్) రూ. 89,306.22 కోట్లు తగ్గి రూ. 9,66,261.05 కోట్లకు పడిపోయింది. మొత్తంగా దేశంలోని టాప్-10 కంపెనీలు కలిపి రూ. 4.48 లక్షల కోట్ల సంపదను కోల్పోయాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో అన్ని రంగాల్లో అమ్మకాల వెల్లువ కొనసాగింది. ఈ వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 4,354 పాయింట్లు, నిఫ్టీ 1,299 పాయింట్లు నష్టపోయాయి. ఎస్‌బీఐ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీగా నష్టపోయింది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 61,715 కోట్లు తగ్గి రూ. 12,57,391 కోట్లకు చేరింది. అలాగే, బజాజ్ ఫైనాన్స్ రూ. 59,082 కోట్లు, టీసీఎస్ రూ. 53,312 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 42,205 కోట్ల చొప్పున తమ మార్కెట్ విలువను కోల్పోయాయి. వీటితో పాటు భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్‌ఐసీ, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి కంపెనీలు కూడా వేల కోట్ల రూపాయల నష్టాలను చవిచూశాయి.





## పద్మ అవార్డులకు నామినేషన్లు ప్రారంభం

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మ అవార్డులు-2027 కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆదివారం ప్రారంభించింది. 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించనున్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి 2026 జూలై 31 చివరి తేదీ అని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు లేదా సిఫార్సులను కేవలం రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. 1954లో ప్రారంభమైన ఈ పురస్కారాలను పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు కేటగిరీలలో ఏటా అందిస్తున్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారిని ఈ అవార్డులతో సత్కరిస్తారు. ఈ నేపథ్యంలో ప్రతిభావంతులను గుర్తించి నామినేట్ చేయాలని పౌరులను కోరింది. ముఖ్యంగా మహిళలు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు, సమాజానికి నిస్వార్థ సేవ చేస్తున్న వారిని గుర్తించి సిఫార్సు చేయాలని సూచించింది. పౌరులు తమకు తాముగా కూడా నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. జాతి, వృత్తి, హోదా, లింగ బేధాలు లేకుండా అందరూ ఈ అవార్డులకు అర్హులే. అయితే, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు (వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా) వీటికి అనర్హులు.

## లయ్యారి చిత్రం



## జోరు పెంచిన విజయ్ దేవరకొండ



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ ఇప్పుడు ఫుల్ జోష్‌లో ఉన్నారు. పెళ్లి తర్వాత తన వ్యక్తిగత జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, ప్రొఫెషనల్ లైఫ్‌లో మునుపెన్నడూ లేని విధంగా స్పీడ్ పెంచారు. ఏకంగా ఐదు భారీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. విజయ్ దేవరకొండ ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో 'రణబాలి' అత్యంత కీలకంగా మారింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. దీనితో పాటు రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న 'రౌడీ జనార్ధన'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ పక్కా మాస్ ఎంటర్టైనర్ విజయ్‌ను మళ్ళీ సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తుందని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఈ రెండు సినిమాలే కాకుండా, విజయ్ దేవరకొండ మరికొన్ని సెన్సేషనల్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'హాయ్ నాన్న' సినిమాతో తన ప్రతిభను చాటుకున్న డైరెక్టర్ శౌర్యువ్‌తో ఒక కొత్త సినిమా చేయబోతున్నారు. ఇక వీటితో పాటు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ సుకుమార్‌తో ఒక క్రేజీ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉంది. అలాగే మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్‌తో కూడా ఒక సినిమా లైన్‌లో పెట్టినట్లు సమాచారం. గౌతమ్ తిన్ననూరితో చేస్తున్న ఎఛ12 ప్రాజెక్ట్ కూడా షూటింగ్ జరుపుకుంటోంది. ఇలా వరుసగా ఐదు సినిమాలతో విజయ్ రాబోయే రెండేళ్లపాటు థియేటర్లలో సందడి చేయనున్నారు.

## అట్టహాసంగా ఉస్తాద్ ప్రీ రిలీజ్ వేడుక



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. నగరంలోని యూసుఫ్ గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకను భారీ ఎత్తున నిర్వహిస్తుండటంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంతకుముందు, శనివారం సాయంత్రం విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఇప్పటికే టీజర్, పాటలతో సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, ట్రైలర్ ఆ హైప్‌ను మరింత పెంచింది. దర్శకుడు హరీశ్ శంకర్, పవన్ కల్యాణ్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'గబ్బర్ సింగ్' బ్లాక్‌బస్టర్ కావడంతో, ఈ చిత్రంపై సినీ వర్గాల్లో, ట్రేడ్ అనలిస్టుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ కాంబినేషన్ మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటించారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాలో పాటలకు సంగీతం అందించడం ఒకెత్తయితే, తమన్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అందించడం మరో ఎత్తు. ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

## థాయ్‌లాండ్‌లో రాయ్ లక్ష్మీ హాట్ ఫీస్ట్



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తన గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాయ్ లక్ష్మీ ప్రస్తుతం సినిమాల కంటే తన అల్ట్రా లగ్జరీ లైఫ్ స్టైల్‌తోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ తాజాగా థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్నట్లు సమాచారం. అక్కడ పచ్చని ప్రకృతి ఒడిలో, ఎగ్జోటిక్ లొకేషన్లలో విహరిస్తూ ఫుల్ చిల్ అవుతోంది. ఈ విహారయాత్రకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లలో రాయ్ లక్ష్మీ ఒక ప్రత్యేకమైన వాహనాన్ని నడుపుతూ కనిపిస్తోంది. దీనిని ఆల్ టెర్రైన్ వెహికల్ లేదా ఏటీవీ అని పిలుస్తారు. పచ్చని అడవులు, ఇరుకు సందులు, కొండ ప్రాంతాల్లో ప్రయాణించడానికి ఈ వాహనం ఎంతో అనువైనది. నాట్ లాస్ట్, జస్ట్ ఎక్స్ ప్లోరింగ్.. బార్న్ ఫర్ ది వైలడ్ అంటూ క్యాప్షన్లు ఇస్తూ ఈ సాహసోపేతమైన రైడ్‌ను లక్ష్మీ రాయ్ తెగ ఎంజాయ్ చేస్తోంది. చిట్టి పొట్టి డెనిమ్ షార్ట్స్ , బ్లాక్ ఇన్నర్ ధరించి తన బోల్డ్ లుక్స్‌తో కుర్రకారు గుండెల్లో గుబులు రేపుతోంది. అయితే, గత ఐదారేళ్లుగా రాయ్ లక్ష్మీకి చెప్పుకోదగ్గ సినిమాలు లేదా వెబ్ సిరీస్‌లు లేకపోయినా, తను లీడ్ చేస్తున్న లగ్జరీ జీవితం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఖరీదైన విదేశీ యాత్రలు, అల్ట్రా మోడ్రన్ దుస్తులు, విలాసవంతమైన జీవనశైలికి ఆమెకు అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోందని నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. కేవలం సినిమాలు మాత్రమే కాకుండా.. పలు బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు.. కమర్షియల్ ఈవెంట్స్.. సోషల్ మీడియా ప్రమోషన్ల ద్వారా బాగానే ఆర్జిస్తోందని అంచనా వేస్తున్నారు.



## పార్థిబన్ కూతురితో క్లోజ్‌గా త్రిష

సినీ పరిశ్రమలో విభేదాలు, విమర్శలు సర్వసాధారణం. అయితే ఆ విమర్శలను వ్యక్తిగతంగా తీసుకోకుండా, వృత్తిపరంగా , వ్యక్తిగతంగా హుందాగా వ్యవహరించేవారు చాలా తక్కువ మంది ఉంటారు. తాజాగా సౌత్ హీరోయిన్ త్రిష సరిగ్గా ఇదే నిరూపించారు. సెలబ్రిటీ స్టైలిస్ట్ ఏకా లఖానీ వివాహ వేడుకలో త్రిష, నటుడు పార్థిబన్ కుమార్తె కీర్తనతో కలిసి దిగిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతంలో పార్థిబన్ చేసిన ఘాటు వ్యాఖ్యల నేపథ్యంలో, త్రిష ఇలా ఆయన కుమార్తెతో ఎంతో ఆత్మీయంగా మెలగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. నిజానికి గతంలో ఒక వివాహ రిసెప్షన్‌లో త్రిష –విజయ్‌ల ఉద్దేశించి పార్థిబన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. అలాగే విజయ్ రాజకీయ ప్రయాణంపై కూడా ఆయన పరోక్షంగా సెటైర్లు వేశారు. ఆ సమయంలో త్రిష సోషల్ మీడియా వేదికగా తన అసహనాన్ని వ్యక్తం చేసినప్పటికీ, ఆ వివాదాన్ని అక్కడితోనే వదిలేశారు. ఇప్పుడు ఏకా లఖానీ పెళ్లిలో పార్థిబన్ కుమార్తె కీర్తన కనిపిస్తే త్రిష ఆమెను ఆత్మీయంగా పలకరించడమే కాకుండా సెల్ఫీలు దిగి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం ఆమెలోని గొప్ప సంస్కారానికి సూచికగా చెప్పొచ్చు.

## వైరముత్తుకు పవన్ అభినందనలు.. చిన్మయి ఫైర్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ఒక పోస్ట్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికైన ప్రముఖ తమిళ కవి, సినీ గేయ రచయిత వైరముత్తుకు ఆయన తెలిపిన శుభాకాంక్షలపై గాయని చిన్మయి శ్రీపాద తీవ్రంగా స్పందించారు. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అభినందనలు



చెప్పడమేంటని ఆమె ప్రశ్నించారు. జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికైనందుకు వైరముత్తుకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ పవన్ కల్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. వైరముత్తు సాహితీ సేవలను కొనియాడుతూ, ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం దక్కాలని ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ పోస్ట్‌పై స్పందించిన చిన్మయి, "గౌరవంతో చెబుతున్నా... పవన్ కల్యాణ్ గారికి ఆ కవి గురించి ఎలాంటి ఐడియా లేదనుకుంటా. తమను లైంగికంగా వేధించాడని ఎందరో మహిళలు ఆరోపించిన వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యం, సంతోషంగా ఉండాలని పవన్ గారు కోరుతున్నారు. అతను ఎలాంటి వాడో పవన్ కు సొంత ఆఫీస్ వాళ్లైనా చెప్పాలి" అని వ్యాఖ్యానించారు. ఒక సినీ గేయ రచయితకు ఇంతమంది రాజకీయ నాయకులు ఎందుకు శుభాకాంక్షలు చెబుతున్నారో అర్థం కావడం లేదంటూ ఆమె చురకలు అంటించారు.



## సినిమా వర్కౌట్ కాదనిపించింది: రాశీ ఖన్నా

సినిమా ఇండస్ట్రీలో ఏదైనా సినిమా ఫ్లాప్ అయితే ఆ నెపాన్ని ఒకరిపై ఒకరు నెట్టేయడం సహజం. కానీ, టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రాశీ ఖన్నా మాత్రం తన గత చిత్రం 'తెలుసు కదా' విషయంలో అత్యంత నిజాయితీగా స్పందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా వచ్చిన ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, షూటింగ్ సమయంలోనే తనకు ఎదురైన సందేహాలను, సినిమా రిజల్ట్‌పై తనకున్న ముందస్తు అంచనాలను ఆమె కుండబద్దలు కొట్టినట్లు వివరించారు. సాధారణంగా నటీనటులు తమ సినిమా ఫలితం ఎలా ఉన్నా వెనకేసుకొస్తుంటారు, కానీ రాశీ ఖన్నా మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. నీరజ కోన దర్శకత్వంలో వచ్చిన 'తెలుసు కదా' సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడే ఈ చిత్రం సరిగ్గా వర్కవుట్ కాదేమో అని తనకు అనిపించిందట. ఇదే విషయాన్ని ఆమె షూటింగ్ సెట్స్‌లోనే టీమ్ సభ్యులకు నేరుగా చెప్పేశానని వెల్లడించారు. "సినిమా చేస్తున్నప్పుడే నాకు ఎక్కడో చిన్న అనుమానం ఉండేది, ఇది ఆడియన్స్‌కు నచ్చుతుందా లేదా అని. కానీ దర్శకురాలి మీద ఉన్న గౌరవంతో ఆమె చెప్పినట్లు చేసుకుంటూ వెళ్లాను" అని రాశీ ఖన్నా తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. ఒక హీరోయిన్ ఇంత ఓపెన్‌గా మాట్లాడటం ఇప్పుడు ఫిలిం నగర్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

## ఈ వారం ఓటీటీ చిత్రాలివే..




ఈ వారం ఓటీటీల్లో చాలా చిత్రాలు స్ట్రీమింగ్ అవుతున్నాయి. థియేటర్స్ లో ప్రతి వారం వరుసగా సినిమాలు రిలీజ్ అవుతున్నా.. ఓటీటీల పై ప్రేక్షకులు బాగా ఆసక్తి చూపిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే ఓటీటీ సంస్థలు కూడా ప్రేక్షకులను అలరించడానికి ఎప్పటికప్పుడు కొత్త కంటెంట్ తో వినూత్న చిత్రాలతో మరియు వెబ్ సిరీస్ లతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి.

ఈ వారం ఓటీటీలో రిలీజ్ అయ్యే చిత్రాలు, వెబ్ సిరీస్ లు ఇవే.

**అమెజాన్ ప్రైమ్ వీడియో:**
కపుల్ ఫ్రెండ్లీ (మూవీ) తెలుగు/తమిళ్, లాక్‌డౌన్ (మూవీ) తమిళ్/తెలుగు, లోకల్‌టైమ్స్ (వెబ్‌సిరీస్) తమిళ్, ఆస్పిరెంట్స్ (వెబ్‌సిరీస్) హిందీ/తెలుగు, ది తాజ్ స్టోరీ (మూవీ) హిందీ/తెలుగు, స్కార్‌పెట్టా (వెబ్‌సిరీస్) ఇంగ్లీష్/తెలుగు, యానివర్సరీ (మూవీ)ఇంగ్లీష్/తెలుగు

**నెట్‌ఫ్లిక్స్**
వన్ పీస్: సీజన్2 (వెబ్‌సిరీస్) ఇంగ్లీష్/తెలుగు, గ్లాడియేటర్2 (మూవీ) ఇంగ్లీష్, వర్జిన్ రివర్: సీజన్7 (వెబ్‌సిరీస్) ఇంగ్లీష్

**జీ5**
బూకీ (మూవీ) తమిళ్/తెలుగు, అంధప్యార్2 (వెబ్‌సిరీస్) హిందీ

**సన్‌నెక్స్ట్**
ఫ్రైడే (మూవీ) తమిళ్, సుక్రాన్ (మూవీ) మలయాళం

**జియో హాట్‌స్టార్**
రిసార్ట్ (వెబ్‌సిరీస్) తమిళ్/తెలుగు, జూటోపియా2 (మూవీ) ఇంగ్లీష్/తెలుగు, రూస్టర్ (వెబ్‌సిరీస్) ఇంగ్లీష్, ది మ్యాడిసన్ (వెబ్‌సిరీస్) ఇంగ్లీష్





# అభిషేక్ క్రేజ్ చూసి మాకు అసూయ సంజు శాంసన్

టీ20 ప్రపంచకప్ 2026ను ముద్దాడిన ఆనందంలో ఉన్న టీమిండియా సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటున్నారు. 'ఇండియా టుడే కాన్‌క్లేవ్'లో పాల్గొన్న సంజూ శాంసన్, తన ఓపెనింగ్ భాగస్వామి అభిషేక్ శర్మపై ప్రశంసలు కురిపిస్తూనే ఒక సరదా నిజాన్ని బయటపెట్టారు. జట్టులో అభిషేక్‌కు ఉన్న క్రేజ్ చూసి తామంతా ఒకానొక సమయంలో అసూయపడ్డామని నవ్వుతూ చెప్పుకొచ్చారు. "అభిషేక్ ఇప్పుడు టీమిండియాకు అసలైన సూపర్ స్టార్. మేము ఎక్కడికి వెళ్లినా, బస్సును ఫ్యాన్స్ చుట్టుముట్టి 'అభిషేక్.. అభిషేక్..' అని అరుస్తుంటే మాకు ఆశ్చర్యం వేసేది. అందరూ ఇతన్నే చూస్తున్నారా? మమ్మల్ని ఎవరూ గమనించడం లేదా? అని జట్టులోని కుర్రాళ్లం ఒకరి మొహాలు ఒకరం చూసుకుని సరదాగా ఈర్ష్య పడేవాళ్లం" అని సంజూ పేర్కొన్నాడు. అభిషేక్ వ్యక్తిత్వం, అతడు ఆటను ఆస్వాదించే తీరు అందరికీ ఇష్టమని చెప్పాడు. సంజూ–అభిషేక్ జోడీని సాధారణంగా 'ఐస్ అండ్ ఫైర్' (ఒకరు కూల్, ఒకరు అగ్రెసివ్) అని పిలుస్తుంటారు. కానీ సంజూ దీనిని విభేదిస్తూ.. "మేము ఐస్ అండ్ ఫైర్ కాదు, 'ఫైర్ అండ్ ఫైర్' (మంటకు మంట). ఒకవేళ అతడు తగ్గితే నేను బాదుతాను, నేను తగ్గితే అతడు విరుచుకుపడతాడు. మా ఇద్దరి మధ్య కేరళ–పంజాబీ బంధం చాలా బలంగా ఉంది. క్రీజులో మా మధ్య కమ్యూనికేషన్ చాలా సింపుల్‌గా ఉంటుంది. బంతి ఎలా వస్తుందని అతడు అడిగితే.. 'బానే వస్తోంది, సిక్సర్ కొట్టు' అని నేను చెబుతాను. అంతా చాలా నేచురల్‌గా జరిగిపోతుంది" అని వివరించారు.

# రహస్యంగా యశ్ దయాళ్ పెళ్లి

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేస్ బౌలర్ యశ్ దయాళ్ ఓ ఇంటివాడయ్యాడు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ శ్వేత పుండిర్‌ను వివాహం చేసుకున్నాడు. గత నెలలోనే వీరి పెళ్లి జరిగినప్పటికీ, ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, వీరి వివాహం ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగింది. ఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ఈ జంట తమ పెళ్లి విషయాన్ని సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించలేదు. అయితే, దయాళ్ తో ఉన్న కొన్ని క్షణాలను శ్వేత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో రూపంలో పంచుకున్నారు. ఢిల్లీకి చెందిన శ్వేత పుండిర్ ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, వ్లాగర్‌గా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాలో 5.87 లక్షల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా యశ్ దయాళ్ ఐపీఎల్‌లో మంచి పేరు తెచ్చుకున్నాడు. 2022లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడి, ఆ జట్టు టైటిల్ గెలవడంలో భాగమయ్యాడు. ఆ తర్వాత 2024 సీజన్‌లో ఆర్సీబీకి మారాడు. గత ఏడాది ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవడంలోనూ దయాళ్ కీలక పాత్ర పోషించాడు. మార్చి 28న ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఆర్సీబీ యాజమాన్యం అతడిని అట్టిపెట్టుకుంది. ఈ సీజన్‌లో టైటిల్ డిఫెండింగ్ లక్ష్యంతో బరిలోకి దిగుతున్న ఆర్సీబీకి దయాళ్ సేవలు కీలకం కానున్నాయి. మార్చి 28న చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆర్సీబీ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. కాగా, యశ్ దయాళ్ పై జైపూర్ లో లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం గతంలో సంచలనం సృష్టించింది. యశ్ దయాళ్ తనను హోటల్ కు పిలిచి లైంగిక దాడి చేశాడని 17 ఏళ్ల అమ్మాయి తీవ్ర ఆరోపణలు చేసింది. క్రికెట్ లో మంచి కెరీర్ అందిస్తానని హామీ ఇచ్చి, రెండేళ్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆమె వెల్లడించింది. దాంతో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.





# సంస్థ కంటే ఏ జట్టూ ఎక్కువ కాదు: జైషా



టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి ముందు చోటుచేసుకున్న తీవ్ర ఉత్కంఠ, రాజకీయ పరిణామాలపై ఐసీసీ ఛైర్మన్ జై షా తొలిసారి నోరు విప్పారు. ముంబైలో జరిగిన 'ఇండియన్ బిజినెస్ లీడర్ అవార్డ్స్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. కొన్ని జట్లు టోర్నీకి దూరం కావడం వల్ల ఈవెంట్ భవితవ్యం ప్రశ్నార్థకమైన తరుణంలో ఐసీసీ తీసుకున్న కఠిన నిర్ణయాలను సమర్థించుకున్నారు. ఏ ఒక్క జట్టూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (×జజ) కంటే పెద్దది కాదని ఆయన స్పష్టం చేశారు. భద్రతా కారణాల సాకుతో భారత్‌కు ప్రయాణించేందుకు బంగ్లాదేశ్ నిరాకరించడం, ఫలితంగా ఆ జట్టును టోర్నీ నుంచి తప్పించి స్కాట్లాండ్‌ను చేర్చుకోవడం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. బంగ్లాకు మద్దతుగా తొలుత భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పాకిస్థాన్ హెచ్చరించినా, ఆ తర్వాత వెనక్కి తగ్గి టోర్నీలో పాల్గొంది. ఈ పరిణామాలపై స్పందిస్తూ.. "ఒక సంస్థ అంటే అన్ని జట్ల కలయిక. ఏ ఒక్క జట్టు సంస్థను శాసించలేదు" అని జై షా పరోక్షంగా చురకలు అంటించారు. వివాదాల మధ్య మొదలైనప్పటికీ ఈ వరల్డ్ కప్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించిందని జై షా వెల్లడించారు. ఒకే సమయంలో సుమారు 7.2 మిలియన్ల మంది డిజిటల్ వ్యూయర్స్ టోర్నీని వీక్షించడం ప్రపంచ రికార్డు అని పేర్కొన్నారు. అసోసియేట్ జట్లైన నేపాల్, జింబాబ్వే, నెదర్లాండ్స్ వంటి దేశాలు దిగ్గజ జట్లకు గట్టి పోటీ ఇవ్వడం క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకమని ఆయన అభినందించారు. వరల్డ్ కప్ గెలిచిన టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్‌లను ఉద్దేశించి జై షా కీలక వ్యాఖ్యలు చేశారు. "శిఖరాగ్రం నుంచి కిందకు పడిపోవడానికి కొన్ని నెలలు చాలు, కానీ మళ్లీ పైకి ఎదగడానికి ఏళ్లు పడుతుంది. కష్టపడటం ఆపకండి" అని హితవు పలికారు. 2028 ఒలింపిక్స్ కోసం తాను బీసీసీఐలో ఉన్నప్పుడే ప్రణాళికలు వేశానని, ఇప్పుడు జట్టు 2031, 2036 లక్ష్యంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.




# మున్ముందూ భారత్‌దే ఆధిపత్యం

## రోహిత్ శర్మ

ఐసీసీ టోర్నీల్లో ఇటీవల భారత పురుష, మహిళా జట్లు అద్భుతాలు చేశాయి. రోహిత్, సూర్య నాయకత్వంలో వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లను నెగ్గింది. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో తొలిసారి మహిళా వన్డే ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంది. ఐసీసీ టోర్నీల్లో భారత ఆధిపత్యానికి ఇది ఆరంభం మాత్రమేనని.. మున్ముందూ కొనసాగుతుందని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆశాభావం వ్యక్తం చేశాడు. 'భారత్ వరుసగా అద్భుతాలు సాధించడం గర్వంగా ఉంది. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్‌ఇండియా ఆధిపత్యం కొనసాగుతోంది. త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. మున్ముందూ ఇదే దూకుడు కొనసాగుతుందని నమ్ముతున్నా. పురుషుల జట్టు వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లను నెగ్గింది. అయితే, మహిళా జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నా. తొలిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. ముంబయి వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను చూడటం చాలా బాగుంది. అయితే, ఇది ఆరంభం మాత్రమే. ఒక్కసారి ఇలాంటి స్థితికి చేరుకున్నాక.. ముందుకు సాగిపోవాల్సిందే. అందరిపై బాధ్యత ఇంకా పెరుగుతుంది' అని రోహిత్ వివరించాడు. 'ఎప్పుడు అవకాశం వచ్చినా.. అందుకోవడానికి సిద్ధంగా ఉండాలి. ప్రతి సవాల్‌ను స్వీకరించాలి. అందుకోసం సన్నద్ధతే కీలకం. జాతీయ జట్టుకు ఎవరినైనా ఎంచుకున్నారంటే దానికి కారణం ఉంటుంది. మన దేశంలో చాలా పోటీ ఉంది. అండర్–14 నుంచే కష్టపడాలి. అద్భుతమైన టాలెంట్ ఉన్నా సరే కాస్త అదృష్టమూ కలిసిరావాలి. సరైన సమయంలో మనలోని ఆటగాడిని గుర్తించే వ్యక్తి తారసపడాలి. మీ దగ్గర మంచి నైపుణ్యం ఉన్నా సరే ఎవరికీ చూసే అవకాశం రాకపోతే వృథానే. లక్ ఉండటంతోపాటు.. నిరంతరం శ్రమించడం అంతకంటే ముఖ్యం. కేవలం ముంబయి క్రికెటర్లకు మాత్రమే కాదు.. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఇదే సూత్రం వర్తిస్తుంది' అని పేర్కొన్నాడు.

# క్రికెట్‌కు పాక్ క్రికెటర్ సర్ఫరాజ్ గుడ్ బై



పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ సర్ఫరాజ్ అహ్మద్ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. సుమారు రెండు దశాబ్దాల పాటు సాగిన తన ప్రయాణానికి ఆదివారం వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 2017లో సర్ఫరాజ్ సారథ్యంలోనే పాకిస్థాన్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకోవడం విశేషం. 37 ఏళ్ల సర్ఫరాజ్ పాకిస్థాన్ తరఫున 54 టెస్టులు, 117 వన్డేలు, 61 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 6,164 పరుగులు చేశాడు. ఇందులో 6 సెంచరీలు, 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. వికెట్ కీపర్‌గా 315 క్యాచ్‌లు, 56 స్టంపింగ్‌లతో సత్తా చాటాడు. జూనియర్, సీనియర్ స్థాయిలో ఐసీసీ టైటిళ్లు గెలిపించిన ఏకైక కెప్టెన్‌గా సర్ఫరాజ్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. 2006లో అతడి నాయకత్వంలోని అండర్–19 జట్టు ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్‌ను ఓడించి టైటిల్ గెలిచింది. సర్ఫరాజ్ కెప్టెన్సీలో పాకిస్థాన్ జట్టు టీ20 ఫార్మాట్‌లో అగ్రస్థానానికి చేరడంతో పాటు వరుసగా 11 సిరీస్‌లు గెలిచి ప్రపంచ రికార్డు సృష్టించింది. బాబర్ అజామ్, షహీన్ అఫ్రిది, హసన్ అలీ, ఫఖార్ జమాన్ వంటి స్టార్ ఆటగాళ్లు అతడి కెప్టెన్సీలోనే వెలుగులోకి వచ్చారు. "పాకిస్థాన్ తరఫున ఆడటం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. జట్టును అన్ని ఫార్మాట్లలో నడిపించాలన్న నా కల నెరవేరింది. నా ఎదుగుదలకు సహకరించిన సహచరులకు, కోచ్‌లకు, అభిమానులకు కృతజ్ఞతలు" అని సర్ఫరాజ్ తన ప్రకటనలో పేర్కొన్నాడు.

# అబ్రార్ అహ్మద్ ఆడేది అనుమానమే!

బ్రిటన్ వేదికగా జరిగే 'ది హండ్రెడ్' టోర్నీలో సన్‌రైజర్స్ జట్టుకు ఊహించని చిక్కులు వచ్చి పడ్డాయి. పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను ఈ ఫ్రాంచైజీ భారీ ధరకు కొనుగోలు చేసినప్పటికీ ప్రస్తుతం వస్తున్న వ్యతిరేకత నేపథ్యంలో అతడు బరిలోకి దిగడంపై సందిగ్ధత నెలకొంది. ఐపీఎల్‌లో 'సన్‌రైజర్స్ హైదరాబాద్' (ూ=ు), దక్షిణాఫ్రికా లీగ్‌లో 'సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్' జట్లను నడుపుతున్న యాజమాన్యమే ఈ ఫ్రాంచైజీని కూడా నిర్వహిస్తోంది. లండన్‌లో ఆదివారం జరిగిన వేలంలో అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఏకంగా 1,90,000 పౌండ్లకు (సుమారు రూ. 2.34 కోట్లు) సొంతం చేసుకుంది.



అయితే, భారతీయ మూలాలున్న సన్‌రైజర్స్ యాజమాన్యం ఒక పాకిస్థాన్ ఆటగాడిని ఇంత భారీ ధరకు కొనుగోలు చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అతడు జట్టులో కొనసాగుతాడా లేదా అన్న చర్చ మొదలైంది. అబ్రార్ ఎంపికపై వస్తున్న విమర్శల నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యం పునరాలోచనలో పడినట్లు సమాచారం. ఒకవేళ నిరసనలు తీవ్రమైతే, టోర్నీ ప్రారంభానికి ముందే అతడిని తప్పించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వివాదంపై అటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు గానీ, ఇటు సన్‌రైజర్స్ యాజమాన్యం గానీ ఇంకా అధికారికంగా స్పందించలేదు.

# కేకేఆర్ బాధ్యతలు మళ్లీ రహానేకే!

కోల్‌కతా నైట్‌రైడర్స్ గత సీజన్‌లో దారుణ ప్రదర్శనతో విమర్శలపాలైంది. అజింక్య రహానె నాయకత్వంలోని ఆ జట్టు ఎనిమిదో స్థానంతో లీగ్‌ను ముగించింది. మరికొద్ది రోజుల్లో ఐపీఎల్ 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. దీంతో రహానెను మారుస్తారంటూ కథనాలు వచ్చాయి. కానీ, జట్టు సారథిగా మళ్లీ రహానెను కొనసాగించేందుకు అవకాశాలు ఉన్నట్లు తాజాగా క్రికెట్ వర్గాలు తెలిపాయి. 'రహానె మాకు బెస్ట్ ఛాయిస్. అతడి అనుభవం అక్కరకొస్తుంది. ఫ్రాంచైజీ ఇప్పటికే దీనిపై నిర్ణయం తీసుకుంది. అతడిని కొనసాగించేందుకు మొగ్గు చూపిస్తోంది' అని కేకేఆర్ వర్గాలు పేర్కొన్నాయి. గత సీజన్‌లో 37 ఏళ్ల రహానె 13 మ్యాచుల్లో 390 పరుగులు చేశాడు. కేకేఆర్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ కావడం గమనార్హం. మరోసారి వన్‌డౌన్‌లోనే అతడు బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. గత వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తన బ్యాటింగ్ లైనప్‌ను బలోపేతం చేసుకుంది. వరల్డ్ కప్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన కివీస్ ఆటగాడు ఫిన్ అలెన్‌తోపాటు మరో డేంజరస్ ఆటగాడు టిమ్ సీఫెర్ట్, రచిన్ రవీంద్రను సొంతం చేసుకుంది. కామెరూన్ గ్రీన్‌నూ కేకేఆర్ దక్కించుకొంది. ఈ నలుగురూ టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగల సమర్థులే. కానీ, సునీల్ నరైన్, బ్లెస్సింగ్ ముజరబాని, రోవ్‌మన్ పావెల్, మతీశా పతిరన రూపంలో మరో నలుగురు విదేశీ స్టార్ ప్లేయర్లు కూడా ఆ జట్టులో ఉన్నారు. దీంతో తుది జట్టులో ఎవరికి అవకాశం వస్తుందో చూడాలి. గాయం కారణంగా హర్షిత్ రాణా ఈ సీజన్‌కు దూరమవుతున్నట్లు వార్తలు వచ్చాయి. అధికారికంగా కేకేఆర్ నిర్ణయం ప్రకటించాల్సి ఉంది. అతడికి బదులు ఎవరిని తీసుకుంటుందో చూడాలి.



# సంజు కుదురుకుంటే..: గంభీర్

టీ20 ప్రపంచ కప్‌లో వరుసగా మూడు హాఫ్ సెంచరీలు సాధించిన సంజు శాంసన్.. టీమ్‌ఇండియా ట్రోఫీని నెగ్గడంలో కీలక పాత్ర పోషించాడు. మొదట్లో అవకాశాలు రాకపోయినా.. తన వంతు వచ్చినప్పుడు మాత్రం ప్రత్యర్థులపై విరుచుకుపడ్డాడు. మరీ ముఖ్యంగా పవర్‌ప్లేలో హిట్టింగ్‌తో అదరగొట్టిన సంజుపై భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసల వర్షం కురిపించాడు. గతంలో తానూ అభిషేక్ మాదిరిగా డకౌట్‌లు అయినట్లు గంభీర్ గుర్తు చేసుకున్నాడు. "సంజు శాంసన్ ఏం చేయగలడో మనకు తెలుసు. అతడి టాలెంట్, దూకుడుపై ఎలాంటి అనుమానాలు లేవు. ఒక్కసారి కుదురుకుంటే.. మొదటి ఆరు ఓవర్లలోనే మ్యాచ్‌ను గెలిపించగలడు. జింబాబ్వేతో మ్యాచ్‌కు ముందు మేమిద్దరం కలిసి జిమ్‌లో మాట్లాడుకున్నాం. ఈ మ్యాచ్‌లో నువ్వు ఆడుతున్నావని అప్పుడే చెప్పా. 'సరే, రానివ్వు' అని మాత్రమే బదులిచ్చాడు. మా ఇద్దరి సంభాషణ అలా జరిగింది. ఇది కేవలం హెడ్ కోచ్‌గా కాదు.. ప్లేయర్ల మధ్య ఉండే అనుబంధం. ప్రాక్టీస్ సమయంలోనూ ముఖాముఖిగా ఇలాగే మాట్లాడుకుంటాం" అని గంభీర్ వెల్లడించాడు. "టీ20 ప్రపంచ కప్ ఆరంభంలో ముగ్గురు లెఫ్ట్ హ్యాండర్లను ఆడించాం. ఆ కూర్పును బ్రేక్ చేసేందుకే సంజు శాంసన్‌ను ఆడించామని చాలా మంది అనుకొని ఉంటారు. కానీ, కారణం అది కాదు. మరింత విధ్వంసం తీసుకురావాలనేది మా ఉద్దేశం. గత ఏడాదిన్నరగా మేం చేసిందదే. మైదానంలోకి దిగితే వేగంగా ఆడటంపైనే దృష్టిపెట్టాం. ఇప్పుడు ఆ దూకుడును ఇంకాస్త పెంచాం. అలాగే ప్రత్యర్థి జట్టు ఆఫ్ స్పిన్నర్‌ను తీసుకొచ్చిందని మేం కూర్పులో సంజును తీసుకోలేదు. టాప్ ఆర్డర్ హార్డ్ హిట్టింగ్ ఇంకా కావాలనే ప్రణాళికతో సంజును ఆడించాం" అని గంభీర్ స్పష్టం చేశాడు.



ఈవార్తలు
# ప్రజావాణి

సోమవారం 16-3-2026, జగిత్యాల

www.evarthalu.com

నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

## పల్లెపల్లెకు డ్రగ్స్ మహమ్మారి

ఒకప్పుడు విదేశాలకో, మహానగరాలకో పరిమితమైన డ్రగ్స్ సంస్కృతి నేడు పల్లె పల్లెకూ పాకింది. దేశానికి వెన్నెముకగా నిలవాల్సిన యువతను 'మత్తు' భూతం నిలువునా మింగేస్తోంది. ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన వయసులో, యువత గంజాయి నుండి సింథటిక్ డ్రగ్స్ వరకు రకరకాల వ్యసనాలకు బానిసై తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. అయితే, ఈ వినాశకర ధోరణి ఇప్పుడు కేవలం సామాన్యులకో, విద్యార్థులకో పరిమితం కాకపోవడం గమనార్హం. ఇటీవల వెలుగులోకి వస్తున్న ఘటనలు డ్రగ్స్ కోరలు రాజకీయ వర్గాలకు కూడా వ్యాపించాయని స్పష్టం చేస్తున్నాయి. డ్రగ్స్ నెట్‌వర్క్‌లలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండటం లేదా వారి అండదండలతోనే ఈ దందా సాగుతోందన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. చట్టాన్ని రక్షించాల్సిన వారే లేదా విధాన నిర్ణేతలుగా ఉండాల్సిన వారే ఈ మత్తు ఊబిలో చిక్కుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. రాజకీయ నాయకుల అండదండలు ఉన్నప్పుడు పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అవుతుంది. ఫలితంగా విద్యాసంస్థల సమీపంలో కూడా డ్రగ్స్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పార్టీలు, పబ్బుల పేరుతో మొదలై, అది ప్రాణాపాయ స్థితికి చేరుతోంది. ఒక తరం నాశనమైతే ఆ ప్రభావం దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్రంగా ఉంటుంది. డ్రగ్స్ విషయంలో ఎవరినీ ఉపేక్షించకూడదు. వారు ఎంతటి రాజకీయ పలుకుబడి ఉన్నవారైనా, అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా సరే.. కఠిన చర్యలు తీసుకోవాలి. డ్రగ్స్ రవాణాకు సహకరించే వారిని సామాజిక శత్రువులుగా పరిగణించాలి. కేవలం పట్టుకోవడం మాత్రమే కాకుండా, మూలాల్లోకి వెళ్లి సరఫరా గొలుసును తెంచేయాలి. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా పోరాడాలి. యువతను ఈ వ్యసనం నుండి కాపాడుకోవడం మనందరి బాధ్యత. రాజకీయ నాయకులు ఆదర్శంగా ఉండాలే తప్ప, ఈ విష సంస్కృతిలో భాగస్వాములు కాకూడదు. అప్పుడే మన దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

# మణిరూపంలో మహేశ్వరుడు




**మహాదేవుని త్రినేత్ర సందర్శనం**
**దివ్యకాంతులలో దేవ దేవుడు**
**ధగధగలు విరజిమ్ముతున్న గరళం**
**మణి రూపంలో మహేశ్వరుడు**
**మహాదేవుడి మరో కైలాసం**

శివుడి త్రినేత్రాన్ని చూశారా? ముక్కంటి మూడో కన్ను తెరిస్తే అందులోంచి వచ్చే అగ్నికీలలకు అంతా బూడిద కావలిసిందే. అలాంటప్పుడు ఆ మూడో కన్నును చూడటం సాధ్యమేనా? అంటే సాధ్యమే. ఆ మూడో కంటిలో ఎంత సూర్యుడి నిప్పులు ఎంత వున్నాయో.. చంద్రుడి వెన్నెల అంతే ఉంది. బోళా శంకరుడు ఆ వెన్నెలను ప్రేమతో మనకు అందిస్తున్నాడు. మనల్ని అనుగ్రహిస్తున్నాడు.. వరము శివుడు మణికాంతులతో దర్శనమిస్తున్నాడు. ఉమాపతి నిజంగా లోకా దేవుడు.. ఎక్కడో కైలాసంలో తనను చూసేందుకు భక్తులు పడే కష్టాల్ని చూడలేక... తానే దిగి వచ్చాడు.. భక్తుల దగ్గరకు తానే వస్తున్నాడు.. భక్తులు ఎంతదూరం రాగలిగితే అక్కడే దర్శనమిస్తున్నాడు.. కొన్ని చోట్ల లింగరూపంలో, మరి కొన్ని చోట్ల విగ్రహంగా కనిపించే దేవుడు.. ఇక్కడ మాత్రం ప్రత్యక్షంగా దర్శనమిస్తున్నాడు... మణికాంతులతో ధగధగమంటున్నాడు. వెండి పరచుకున్న కొండపై వేయి వెలుగులు విరజిమ్ముతున్నాయి.. నవరత్నాల మిసమిసల్లో నీలకంఠుడి నిజదర్శనం జరుగుతోంది. ఈ వెలుతురు సామాన్యమైంది కాదు.. మామూలుగా కనిపించే సూర్యకాంతి కానే కాదు.. ఇది ఈశ్వరుడి ఉనికి.. గౌరీపతి తానుగా కైలాసం నుంచి దిగి వచ్చి భక్తులకు సాకారంగా దర్శనమిస్తున్న కాంతిపుంజం.. ఆశ్చర్యం కాదు.. అద్భుతం.. దైవత్వానికి ప్రత్యక్ష నిదర్శనం ఇది.. దేవభూమిలో పరమేశ్వరుడు మనల్ని వెలుగుమొగ్గై కరుణిస్తున్నాడు. త్రినేత్రం లోని వెలుగురవ్వాలు మిమ్మల్ని అనుగ్రహిస్తాయి. గరళకంఠుడి విషం మిమ్మల్ని కరుణిస్తుంది. ఇది నిజం.

దేవభూమి హిమాచలంలో ఒక అద్భుత దృశ్యం కానవస్తోంది. పరమేశ్వరుడు అపూర్వంగా కనిపిస్తున్నాడు.. అపురూపంగా సాక్షాత్కరిస్తున్నాడు.. మణి కాంతులలో దర్శనమిస్తున్నాడు. రత్నకాంతులన్నీ ఒకేచోట కలగలిస్తే.. వాటిలోంచి వచ్చే వెలుగు ఎంత అపూర్వంగా ఉంటుందో అలాంటి వెలుగురూపంలో ఈశ్వరుడి దర్శనం కలుగుతోంది. ఆయన మూడో కంటి నుంచి వెన్నెల కురిపించే ఏకైక ప్రాంతం అది. దేవదేవుడు నిజరూపంలో భక్తులను ఆదరిస్తున్న ఆధ్యాత్మిక పర్వతప్రాంతం. హిమాలయాల్లో కొలువైన మహాదేవుడి దివ్యధామం ఇది. శివుడేమిటి? మణి రూపంలో దర్శనమివ్వటం ఏమిటనుకోవద్దు. నిజంగా పరమశివుడు మణికాంతులతో దర్శనమిస్తున్నాడు. ఈశ్వరుడు మణిరూపంలో భక్తులను అనుగ్రహి స్తున్నాడు. అత్యంత అరుదైన దృశ్యం అది హిమాచలప్రదేశ్.. చంబా జిల్లా.. పీర్ పంజల్ రేంజ్లో మణిమహేశ పర్వతం... అది మరో కైలాసం, మానస సరోవరం దగ్గరి కైలాస పర్వతానికి అచ్చంగా రెప్లికా. సముద్ర మట్టానికి 13,390 అడుగుల ఎత్తున వున్న మణిమహేశ్ పర్వతం.. మౌంట్ కైలాసక్కు కవల పిల్లలా ఉంటుంది. మౌంట్ కైలాస్ ఏ విధంగా కనిపిస్తుందో.. అదే విధంగా మణిమహేశ్ కూడా కనిపిస్తుంది. కైలాస్ పాదం దగ్గర మానస సరోవరం స్వచ్ఛంగా ఉంటుంది. మణిమహేశ్ పర్వత పాదం దగ్గర శివకుండ్ సరస్సు ఉంటుంది. మానస సరోవరంలో నీరు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో. వుడ్లో కూడా అదే విధంగా ఉంటుంది. ఇది అలాంటిలాంటి కొండ కాదు.. శివుడి తపోభూమి, ఈ పర్వత శిఖరంపై స్వామి మణిరూపంలో దర్శనమిస్తాడు. శివుడి కిరీటంలోని పుణికాంతులపై, ఆయన తలపై కొలువైన చంద్రుడి వెన్నెల జత కలిసి మణి మహేశుడిగా దర్శనమిస్తాడని ఇక్కడి ప్రజల్లో ఉన్న విశ్వాసం, నిండు పౌర్ణమి నాడు మహేశ పర్వతం శిఖరభాగంపై వెలువడే కాంతులు, కింద సరస్సులో మణిరూపంలో రిఫ్లెక్ట్ అవుతాయి. ఇది చాలా అరుదుగా జరిగే సంఘటన.


శివుడిని మనం లింగరూపంలో చూశాం.. విగ్రహంగా దర్శించుకున్నాం.. ఇదిగో ఈ పర్వతం దగ్గర మణిరూపంలో దర్శించుకుంటున్నాం. దిగంబరుడు. చర్మాంబరధారి, విభూతి ప్రియుడు, స్మశాన సంచారి.. అన్నీ వదిలేసుకున్న మహాదేవుడు మణిరూపంలో కనిపిస్తున్నాడు. అదే ఇక్కడి గొప్పతనం. బోళాశంకరుడి అనంతమైన కాంతిపుంజానికి నిదర్శనం. సూర్యుడి తొలికిరణం మణిమహేశ శిఖరాన్ని తాకి, కింద ఉన్న సరస్సులో రిఫ్లెక్ట్ అయినప్పుడు అది కాషాయం రంగులో ముక్కంటి మూడో కంటిని చూపిస్తుంది. ఇది ఇక్కడ మాత్రమే జరిగే సన్నివేశం.. ఈశ్వరుడి శక్తిని నిరూపిస్తున్న సత్యం ఇది. సూర్యుడి కిరణాలు నీళ్లలో కనిపించినప్పుడు రకరకాలుగా రిఫ్లెక్ట్ కావటం అందరికీ తెలిసిన విషయమే. ఇందులో దేవుడి గొప్పతనం ఏముంది? మణిమహేశ్ పర్వతంలో అంత స్పెషల్ గా చెప్పుకోవలసింది ఏముంటుంది? అందరిలోనూ సహజంగా కలిగే ప్రశ్నే ఇది. అక్కడే ఉంది అసలు సంగతి..



శివుడి కైలాసం కంటే మణిమహేశకు ఉన్న ప్రత్యేకత వేరు.. ఇక్కడ మాత్రమే కనిపించే అద్భుతం మణి మహేశ్పై శివుడి ఉనికిని చాటుతోంది. మణి మహేష్ ని పర్వతంచటంలో చాలా ఎత్తైన కొండలో ఒకటి. టివిల్లో తైలాసాన్ని పోలి ఉంటుందని ఇంతకు ముందే చెప్పుకున్నాం. మౌంట్ పైనా దగర ఎలాంటి వాతావరణం ఉంటుందో, అలాగే ఉంటుంది మోద్ దగ్గర ఆక్సీజన్ తక్కువగా అంటుంది మణిమహేష్లో మాత్రం అండి తగిన స్థాయ్నిలోనే ఉంటుంది. పర్వతంపైకి ట్రెకింగ్ చేసే వీలూ ఉంది. మణిము పరమేశ్వరుడు స్వయంగా సృష్టించిన మరో కైలాసం.. మాసననరోవర ప్రాంతంటే గౌరీకుండం వద్ద శివపార్వతులు ఆదిదంపతులుగా అవతరించిన తరువాత మణికుహేశీను మరో కైజ్లనంగా సృష్టించాడు. మానస సరోవరం బాగానే ఇక్కడా శివకుంబాన్ని నెలకొాల్పాడు. తన గణాలలో ఒకరుగా ఉన్న గడ్డి గణానికి మణిమహే సహాయానంగా ఇచ్చాడట. ఈ పర్వత ప్రాంతంలో నివసించే గిరిజన తెగల్లో గద్దీ వర్గం ప్రముఖమైనది. ఈ వర్గం గురించి శివపురాణం ప్రముఖంగా ప్రస్తావించింది. రక్ష వినాశనం సమయంలో వీరభద్రుడికి పూర్తి తోడుగా నిలిచిన సైన్యమిది.

ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో అంటే అగస్టులో పరమేశ్వరుడు మణిమహేశైపైకి వచ్చి తపస్సు చేస్తాడట.. ఈ సమయంలోనే పౌర్ణమి రోజుల్లో తపోదీక్షలో ఉన్న శివుడి తంపైనున్న నెలవంక నుంచి మణికాంతులు కొండనున్న సరస్సులో ప్రతిబింబిస్తాయి. ఇది ఇక్కడ ప్రచారంలో ఉన్న కథనం. ఈ మణికాంతులు ఎలా వస్తాయి? ఇవేమీ పెద్ద మిస్టరీ కాదు.. సూర్యుడి కాంతి పుంజాలు పర్వత శిఖర భాగంపై పడినప్పుడు అని మణికాంతులు విరశమ్ముశాయి. చిత్రమేమంటే, మణిమహేశ పర్వత ప్రాంతంలో మార్యుడి కిరణాలు శిఖరం పైభాగం నుంచి ప్రనరించినప్పుడు సరస్సులో అని ఒక సుణిరూపంలో మాత్రమే కనిపిస్తాయి. విచిత్రమేమంటే కనిపించిన ప్రతిసారీ, ఒకే రూపంలో కనిపిస్తాయి. నీటి కదలికల్లోనూ రూపం మారదు... తొలి కిరణ ప్రసారంలో మాత్రమే అగ్ని రూపంలో అంటే కాషాయం రంగులో, శివుడి మూడో కన్ను తలపిస్తుంది? ఇది ఇక్కడ మాత్రమే కనిపించే విశేష... సాధారణంగా సూర్య కిరణాల ప్రసారం క్షణక్షణానికీ మారుతుంటుంది.. ఆ కదలికల ఆధారంగానే వీలు ఉంటాయి. కానీ, మణిమహేశీ మాత్రం ఈ కాంతి మణి రూపంలో మాత్రమే కనిపిస్తాయి. అనే మహేశ్వరుడి ఎగ్జిస్టెన్సు చాలుతోంది ముణి మహేష్ కైలాసన ఒక విచిత్రమైన వాతావరణాన్ని కలిగి ఉంటుంది. హిమాలయ శ్రేణుల్లో ఎక్కడ కనిపించని. విశేషమిది. చిన్ని చిన్ని శబ్దాలు సైతం ఇక్కడ శివపంచాక్షరిని వినిపిస్తాయి. ప్రణవనాదాన్ని ప్రతిధ్వనింపజేస్తాయి. ఈశ్వరుడి ప్రళయ తాండవం ఇక్కడ కనిపించదు... ఆయన తపస్సు ఉపాసనా మార్గం వెళ్లిన వారికి గోచరిస్తుంది. మణిమహేలిక), మౌంట్ కైలాసక్కు మధ్య చాలా పోలికలు ఉన్నాయి. కానీ, రెంటికీ మధ్య ఒక్క తేడా మాత్రం ఉంది. మౌంట్ కైలాస్ పైక్ ఎక్కిన వాళ్లు ఇప్పటి వరకు లేరు.. కానీ, మణిమహేశ్ ట్రెకింగ్కు అనువైన పర్వతమే. 18వేల అడుగులు పైకి అధిరోహిస్తే శిఖరాన్ని చేరుకున్నట్లే పర్వతం కింది భాగాన ఉన్న శివకుంద కు ఇరువైపులా ఉన్న మంచు కొండల నదుము నుంచి పైకి వెళ్లటానికి మార్గం ఉంది... ఈ మార్గం మంచి పైదాణా వెళ్లవచ్చు, మరో విచిత్రం ఏమంటే ఇక్కడి వాతావరణం.. ఇక్కడి సరస్సు చుట్టూ ఇసుక తిన్నెలు కనిపిస్తాయి.

చిన్న చిన్న రెల్లు పొదల్లాంటివి ఎక్కువగా వుంటాయి. ఇక్కడి గాలి ఎంత స్వచ్ఛమైందంటే.. ఆ గాలిని పీలిస్తే చాలు.. మన లోపం కాలుష్యాన్నంతా కడిగేస్తుంది.. చీసులు బాంటి పురుగు, పుట్రా, జంతువులు వంటివి మచ్చుకైనా కనిపించవు. ఏడాది పొడవునా ఒకే వాతావరణం.. ఐపీ కోల్డ్.. ఈ ఒక్క కారణం వల్లనే కావచ్చు. ఈ ప్రాంతంలో భూతద్దం పెట్టి వెతికి చూసినా శాశ్వత నివాసాలు కనిపించవు. భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చినప్పుడు తప్ప ఇక్కడి నిశ్శబ్దానికి ఎప్పుడూ ఆటంకం ఉండదు. ఎందుకంటే ఇది శివుడు తపస్సు చేసుకునే భూమి కాబట్టి. మంచు కురిసినప్పుడు మణిమహేశ్ వెండికొండను తలపిస్తుంది. శివకుండం సమీపంలో మహాదేవుని విగ్రహం ఉంటుంది. యాత్రికులు ఈ విగ్రహానికి పూజలు చేస్తారు. ఈ స్వామిని చౌముఖ అని పిలుస్తారు. మణిమహేశ్ పైకి ట్రెకింగ్ సుమారు తొమ్మిది రోజులు జరుగుతుంది. నాలుగు వైపులనుంచి పైకి ఎక్కవచ్చు. 14 నుంచి 20 కిలోమీటర్ల వరకు ట్రెకింగ్ చేయాల్సి వస్తుంది.. మణి మహేశ్ శివుడి తపోభూమి మాత్రమే కాదు.. ఆయన ఆటలాడుకునే ప్లే గ్రౌండ్ కూడా భక్తులు చెప్పుకుంటారు. యాత్రికుల కంటే కూడా. సాధువులు ఎక్కువగా పర్వతారోహణ చేసే కైలాసం ఇది. అయితే సాధువులు సైతం దూరంగా ఉన్న చంబ జిల్లాలోనే ఉంటారు తప్ప, పర్వత ప్రాంతంలో మాత్రం నివాసం ఏర్పాటు చేసుకోరు. శివుడికి తపోభంగం చేయరాదన్నది ప్రధాన ఉద్దేశం. హిమాలయాల్లోని శివక్షేత్రాల్లో మణిమహేశ్ గొప్పది. శివుడి అయిదు కైలాసాల్లో ఇది మూడో కైలాసం. ఆస్తికులకూ, నాస్తికులకూ కూడా ఆధ్యాత్మిక భావభూమికలను అనంతంగా వంచి ఇచ్చే అపురూప క్షేత్రం.



**కోవెల సంతోష్ కుమార్,**
రచయిత, 9052116463

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.